మసీదు భూమికి ఎసరు

- నెల్లూరులో కలాన్ మసీదు భూమి స్వాహాకు కుట్ర
- ప్రస్తుతం మార్కెట్ విలువ రూ. కోట్లలోనే..
- ఫోర్జరీ ఎన్‌వోసీని బలపరచమని ఒత్తిళ్లు
- ఆ దేవుడు చెప్పినా వక్ఫ్‌బోర్డు స్థలం ఇవ్వం : చైర్మన్ అజీజ్



నెల్లూరు నగరంలోని వివాదాస్పద కలాన్ మసీదు స్థలంలోని భవనం

నెల్లూరు, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలో కేవీఆర్ పెట్రోల్ బంకు కూడలి అంటే ఎంత ముఖ్యమైందో జిల్లా వాసులకు తెలిసిందే. అంతేకాక అది నగరంలో చెప్పుకోదగిన వ్యాపార కూడలి. అక్కడ సెంటు స్థలం విలువ రూ.కోట్లలో ఉంటుంది. అలాంటి ప్రదేశంలో కలాన్ మసీదుకి చెందిన ఆరు ఎకరాల భూమి ఉంది. అందులో కొంత మేర రోడ్డుకు పోయింది. మిగిలిన భూమి వివిధ పద్ధతుల్లో ఇతరుల చేతుల్లోకి వెళ్లిపోయింది. ఇందులో సుమారు 1.5 ఎకరాల భూమికి సంబంధించి ఫోర్జరీ నో అబ్జక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఓసీ)తో భూమిని స్వాధీనం చేసుకున్నారనే అభియోగంపై ఓ వ్యక్తిపై వక్ఫ్ బోర్డు క్రిమినల్ కేసు పెట్టింది. ప్రస్తుతం ఈ కేసు కోర్టులో ఉంది. కేసు చివరి దశకు వచ్చింది. ఈ కేసు ప్రైవేటు వ్యక్తికి అనుకూలం అయ్యేలా సహకరించాలని వక్ఫ్‌బోర్డుపై ఒత్తిళ్లు మొదలయ్యాయి. పలువురు రాజకీయ నాయకులు వివిధ మార్గాల ద్వారా వక్ఫ్‌బోర్డుపై ఒత్తిళ్లు తెస్తున్నట్లు ముస్లిం మైనారిటీ సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు. రూ. వందల కోట్ల విలువైన వక్ఫ్‌బోర్డు భూమిని కాపాడాలని వారు కోరుతున్నారు.

● వైసీపీ ప్రభుత్వం హయాంలో ఎన్‌వోసీ

కలాన్ మసీదుకు చెందిన ఈ భూమిని వక్ఫ్‌బోర్డు తనకు విక్రయించిందని, దాన్ని విక్రయించుకోవడానికి, తనఖా పెట్టుకోవడానికి వక్ఫ్‌బోర్డు అనుమతి ఇస్తూ ఎన్‌వోసీ ఇచ్చిందని ఒక వ్యక్తి డాక్యుమెంట్లతోసహా నగరంలోని ఓ బ్యాంకును ఆశ్రయించారు. ఆ ఎన్‌వోసీ నిజమైనదా... కాదా..? అనుకునే క్రమంలో ఆ బ్యాంక్ యాజమాన్యం సదరు ఎన్‌వోసీని రాష్ట్ర వక్ఫ్‌బోర్డుకు పంపి వివరణ కోరింది. ఈ పత్రాలను పరిశీలించిన వక్ఫ్‌బోర్డు కార్యాలయం ఇది సీఈవో సంతకం కాదని, ఈ ఎన్‌వోసీ వక్ఫ్‌బోర్డు ఇచ్చింది కాదని లిఖితపూర్వకంగా బ్యాంకుకు తెలియజేసింది. దీంతోపాటు సదరు వ్యక్తిపై ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు పెట్టింది. ఐపీసీ 468, 471 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఈకేసు కోర్టు విచారణలో ఉంది. సరిగ్గా ఈ సమయంలో వక్ఫ్‌బోర్డుపై ఒత్తిళ్లు మొదలయ్యాయి. కేసును ఉపసంహరించుకోవాలని, లేదా తీర్పు సదరు వ్యక్తికి అనుకూలంగా వచ్చేలా సహకరించమని పలువురు నాయకులు వక్ఫ్‌బోర్డుపై ఒత్తిళ్లు తెస్తున్నట్లు ముస్లిం మైనారిటీ సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు. సామాజిక మాధ్యమాలు వేదికగా ఈ విషయమై పెద్ద చర్చ నడుస్తోంది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని వక్ఫ్‌బోర్డు భూములను కాపాడాలని ముస్లిం సంఘాలు కోరుతున్నాయి.

దేవుడు చెప్పినా ఇవ్వం...

● వక్ఫ్‌బోర్డు రాష్ట్ర అధ్యక్షుడు అజీజ్

నెల్లూరు(సిటీ), అక్టోబరు 14,(ఆంధ్రజ్యోతి): సాక్షాత్తూ ఆ దేవుడే దిగివచ్చి చెప్పినా వక్ఫ్ బోర్డుకు చెందిన ఆస్తులు ఎవరికీ ధారదత్తం చేయబోమని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్‌అజీజ్ అన్నారు. మంగళవారం నెల్లూరులోని జెండావీధి వద్ద ఉన్న షాదీమంజిల్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా దేవుడి ఆస్తులను కాపాడాలని సీఎం చంద్రబాబు నాయుడు తనకు చెప్పారన్నారు.



కోటమిట్ట షాదీమంజిల్‌లో అధికారులతో మాట్లాడుతున్న వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్

ఆ దిశగా గట్టి నిర్ణయం తీసుకుని వక్ఫ్ బోర్డుకు చెందిన ఆస్తుల రక్షణకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. చైర్మన్‌గా తన వంతు బాధ్యత పూర్తయ్యే వరకు ఆస్తులు కాజేయాలనుకున్న దొంగలు, రియల్టర్లకు నిద్ర ఉండదన్నారు. తన ప్రాణం ఉన్నంత వరకు ఒక్క అంగుళం భూమి కూడా ఎవరినీ తాకనివ్వనని అజీజ్ తేల్చి చెప్పారు. తమ ఆస్తుల జోలికి వస్తున్న ల్యాండ్ మాఫియాతో వైజాగ్ నుంచి అనంతపురం వరకు నిత్యం పోరాడుతూనే ఉంటానని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోని ముస్లింలకు చెందిన వక్ఫ్ ఆస్తులను కాపాడమని హిందువులే ముందుకు వస్తున్నారే తప్ప... మసీదు కమిటీలు వారు రావడం లేదని తెలిపారు. రానున్న వందేళ్లకు ఉపయోగపడేలా జెండావీధిలోని షాదీమంజిల్‌ను డిజైన్ చేసి నిర్మించారని తెలిపారు. నగరంలోని కొత్తహాలు థియేటర్ ఉన్న జామియా మసీదు స్థలాలు అమ్మినా, కొన్నా చెల్లవన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎంసీ కమిషనర్ నందన్, ఇతర అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కూటమిలో రేషన్ కుంపటి..!

- ప్రభుత్వంలో దుమారం రేపిన కోటంరెడ్డి.. పట్టాభి ప్రెస్‌మీట్లు
- వారి వ్యవహారశైలిపై అధిష్ఠానం సీరియస్
- ఆ ఇద్దరిని టాల్‌రైట్ చేయవద్దని మంత్రి నారాయణకు ఆదేశం



నెల్లూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం వ్యవహారంపై నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరెడ్డిల ప్రెస్‌మీట్లు ఏకంగా కూటమి ప్రభుత్వంలో దుమారం రేపాయి. తెలుగుదేశం, జనసేన పార్టీల మధ్య అంతరాలు తెచ్చేస్థాయికి చేరుకున్నాయి. దీంతో తెలుగుదేశం అధిష్ఠానం సీరియస్ అయ్యింది. ఈ వివాదానికి కారణమైన కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పట్టాభిరెడ్డిల విషయంలో కఠినంగా ఉండాలని, పార్టీలో ఉంటూ కూటమి ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా మాట్లాడేవారిని ఉపేక్షించవద్దని మంత్రి పొంగూరు నారాయణను అధిష్ఠానం ఆదేశించింది. రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయని, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీకి చెందిన ఒక నాయకుడు వందల టన్నుల బియ్యాన్ని చెన్నైకి తరలిస్తున్నాడని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి విలేకరుల సమావేశంలో ఘాటుగా విమర్శించిన విషయం తెలిసిందే. ఇదే సమయంలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేరును ఆయన ప్రస్తావించారు. దీనిపై నాదెండ్ల మనోహర్ తీవ్రంగా స్పందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, నారా లోకేష్ బాబుకు, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. పార్టీలో ఉంటూ కూటమికి చెందిన నాయకులపై విమర్శలు చేయడం న్యాయమేనా అని ప్రశ్నించారు. దీంతో రాష్ట్ర టీడీపీ సీరియస్ అయ్యింది. మంత్రి నాదెండ్ల మనోమర్‌కు పత్రికా ముఖంగా క్షమాపణలు చెప్పమని కోటంరెడ్డిని రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు ఆదేశించారు. అదే సమయంలో మంత్రి నారాయణకు కూడా రాష్ట్ర పార్టీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. పార్టీలో ఉంటూ పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసేలా మాట్లాడిన ఈ ఇద్దరి విషయంలో కఠినంగా వ్యవహరించాలని, ఉదాసీనంగా ఉండవద్దని ఆదేశించింది. రేషన్ బియ్యంపై కోటంరెడ్డి ప్రెస్ మీట్‌కు దానికి ప్రతిగా సివిల్ సప్లయ్స్ డైరెక్టర్ పట్టాభి ప్రెస్‌మీట్‌కు ప్రధాన కారణం వీరిద్దరి మధ్య ఉన్న వ్యక్తిగత వైరమే కారణమని రాష్ట్ర పార్టీ భావిస్తోంది. వ్యక్తిగత కక్షలతో పార్టీని, కూటమి స్ఫూర్తిని దెబ్బతీస్తున్న వీరిద్దరి షయంలో ఎందుకు మౌనంగా ఉన్నారని, మీరు చూస్తూ ఎందుకు ఊరికే ఉన్నారని, ఇలాంటి వారిని టాల్‌రైట్ చేయవద్దని రాష్ట్ర పార్టీ మంత్రి నారాయణను గట్టిగా ఆదేశించింది.

'వసతి'లో 'జ్ఞానభూమి'

- హాస్టల్ విద్యార్థుల వివరాల నమోదుకు వెబ్‌సైట్
- సమాచారం పంపితేనే ఫీజు రీయంబర్స్‌మెంట్, కాస్మెటిక్ చార్జీలు
- ప్రక్రియ పూర్తి చేసేపనిలో అధికారులు

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో సరుకులు, విద్యార్థుల హాజరు వివరాలు తప్పనిసరిని నమోదు చేయాలి. వారి వివరాలు పక్కాగా ఉంటేనే ఫీజు రీయంబర్సుమెంటు, కాస్మెటిక్, ఇతర చార్జీలు పొందేందుకు వీలవుతుంది. ఈ క్రమంలో ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లలో వసతులకు పెద్దపీట వేసింది. తాజాగా బీసీ, ఎస్టీ, ఎస్సీ, కాపు, ఈబీసీ, మైనార్టీ వర్గాల వివరాలు నమోదుకు, పక్కాగా సరుకులు మంజూరు నమోదు కోసం జ్ఞానభూమి వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చింది.

● 134 సంక్షేమ వసతి గృహాలు

జిల్లాలో బీసీ సంక్షేమ వసతి గృహాలు 63, ఎస్సీ సంక్షేమ వసతి గృహాలు 71 ఉన్నాయి. మొత్తం 134 సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి. ఇందులో పదో తరగతి చదివే విద్యార్థులు 8,389 వేల మంది ఉన్నారు. ఇవికాక బాలికల కాలేజీ వసతి గృహాలు 16 ఉన్నాయి. వీటిలో 1,100 విద్యార్థినులు ఉంటున్నారు. వీరందరికీ నమోదు ప్రక్రియ జరుగుతోంది.

● వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్

జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్‌కు విద్యార్హత వివరాలతో పాటు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తప్పని సరి. గత విద్యా సంవత్సరంలో ప్రవేశాలు పొందిన వారితో పాటు ఇప్పటికే లబ్ధి పొందుతున్న వారు పాత దరఖాస్తులను పునరుద్ధంచుకోవచ్చు. 75 శాతం హాజరు విధిగా ఉండాలి. కొత్త వారితో పాటు పాతవి పునరుద్ధరణ రిజిస్ట్రేషన్లు అన్నీ కళాశాలల్లో చేస్తారు. విద్యార్థి బయోమెట్రిక్ తీసుకుంటారు. ఆరు దశల వడపోత పరిశీలన విధానం ఈ వెబ్‌సైట్‌లో ఉంది. నిబంధనలకు విరుద్ధంగాగా భూమి, ఆస్తి, విద్యుత్ వినియోగం ఉన్నా, ప్రభుత్వ ఉద్యోగం, పన్ను చెల్లింపుదారులు, నాలుగు చక్రాల వాహనం కలిగి ఉన్నా, వెబ్‌సైట్‌లో నమోదుకు అనర్హులుగా పేర్కొంటారు. విద్యార్థులంగా రిజిస్ట్రేషన్లు త్వరగా పూర్తి చేసుకుని ప్రభుత్వం అందించే లబ్ధి పొందేలా అధికారులు చర్యలు చేపట్టారు.

సోమశిలకు 13.732 క్యూసెక్కుల ప్రవాహం



అనంతసాగరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి మంగళవారం 13.732 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో డ్యాంలో 74.037 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పవర్ టెన్నల్ ద్వారా దిగువకు 2,600, గేట్ల ద్వారా 7,500 ఉత్తర కాలువకు 50, కండలేరుకు వరద కాలువ ద్వారా 3,600 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నామన్నారు.

కండలేరులో 59.880 టీఎంసీలు

రాపూరు, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కండలేరు డ్యాం పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటిమట్టం 59.880 టీఎంసీలుగా ఉన్నదని కండలేరు డ్యామ్ ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 3400 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా, 2050 క్యూసెక్కులు అవుట్ ఫ్లో ఉందని తెలిపారు.

కార్గోల్లో టపాసులు

ప్రతి పార్శిల్‌ను తనిఖీ చేయాలని ఆదేశించాం

దీపావళి సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లోనూ, కార్గోల ద్వారానూ ప్రయాణికులు తీసుకువచ్చే వస్తువులను, పార్శిళ్లను తనిఖీలు చేయమని అధికారులకు ఆదేశాలు జారీ చేశాం. ఈ క్రమంలో ఆర్టీసీ బస్సుల్లోనూ, కార్గో సర్వీసుల్లో బాణసంచా రవాణా చేస్తే, అలాంటి వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేస్తాం.



- షమీమ్, జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలతో ప్రస్తుతం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం భయం..భయంగా సాగుతోంది. ఇటీవల ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించడంతో ఆర్టీసీ బస్సుల్లో ఓఆర్ బాగా పెరిగింది. దీంతో పల్లెలతోపాటు పట్టణ, నగర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో మహిళా ప్రయాణికులు అధిక సంఖ్యలో ప్రయాణాలు సాగిస్తున్నారు. ఇదిలా ఉండగా దీపావళి సందర్భంగా పండక్కి 20 రోజుల ముందుగానే ఇతర ప్రాంతాల నుంచి టపాసులను జిల్లాకు తెప్పించుకుంటున్నారు. టపాసుల రవాణాకు కార్గోను అధికంగా వినియోగిస్తున్నారని సమాచారం. ఆర్టీసీ కార్గోకి వచ్చే బాక్సులు ఏమిటనేది తెలియక పోవడంతో సిబ్బంది సైతం వాటిని మామూలుగానే రవాణా చేస్తున్నారు. ఈ క్రమంలో కార్గోలో వచ్చే టపాసులు ప్రమాదవశాత్తె పేలితే బస్సు మొత్తం మంటల్లో చిక్కుకుని ప్రయాణికులు ప్రమాదంలో పడే అవకాశం ఉంది. ఇకపోతే పట్టణాల నుంచి పల్లెలకు వెళ్లేవారు కూడా బస్సుల్లోనే బాణసంచా రవాణా చేస్తున్నారు.



నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్‌లో పార్శిళ్లు



ఆడబిడ్డలను కాపాడుకుందాం

అంతర్జాతీయ బాలికా దినోత్సవ ర్యాలీలో బాలికలు, మహిళలతో కలెక్టర్ హిమాన్షు శుక్లా, అధికారులు

వివరాలు 8లో..

'ఉపాధి'లో బోగస్‌కు.. ఈకేవైసీతో చెక్

- మస్టర్ల మాయాజాలానికి ఫుల్‌స్టాప్
- వచ్చేనెల 7కి పూర్తయ్యేలా చర్యలు

మర్రిపాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మస్టర్ల మాయాజాలం, ఇతర అవకతవకలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా ఉపాధి శ్రామికులకు ఈకేవైసీ తప్పనిసరి చేసింది. నవంబరు 7లోగా ఈ ప్రక్రియ పూర్తయ్యేలా కార్యాచరణ రూపొందించింది.

● గతంలో ఇలా...

పలు ప్రాంతాల్లో క్షేత్రసహాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఫిర్యాదులు వెల్లువెత్తాయి. కూలికి రాకపోయినా కొందరికి మస్టర్లు వేస్తున్నారు. ఎక్కువ పనిచేసే శ్రామికులకు కొలతలు తగ్గించి.... దాన్ని దొంగ మస్టర్ల వారికి సర్దుబాటు చేస్తున్నారు. దీంతో నిజమైన శ్రామికులకు పూర్తి వేతనం అందేదికాదు. పనులు చేయని వారికి వీరితో సమానంగా నగదు జమ అవుతోంది. స్థానికంగా లేకపోయినా, ఉద్యోగ, వ్యాపారాల నిమిత్తం ఇతర రాష్ట్రాలు, దేశాల్లో ఉన్న వారికి సైతం కూలి మొత్తం జమ అవుతున్న ఉదంతాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పనులకు హాజరయ్యే వారికే వేతనం అందేలా కొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చింది.

శ్రామికులకు ఈకేవైసీ నమోదు పూర్తయితే బోగస్ మస్టర్లకు పూర్తిగా అడ్డుకట్ట పడుతోందని భావిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తి చేయని వారికి.. నవంబరు 7తరువాత పనులు చూపించలేమని అధికారులు స్పష్టం చేశారు. ఈ విషయమై డ్వామా సిబ్బంది ద్వారా గ్రామాల్లో ఇప్పటికే అవగాహన కల్పించారు. ఇక నుంచి పని ప్రాంతంలోనే రోజుకు రెండుసార్లు ముఖ ఆధారిత హాజరు నమోదు చేస్తారు. దీని వల్ల ఒకరి బదులు మరొకరు ఫొటోలు దిగి పని చేసినట్లు చూపినా డబ్బులు తీసుకోవటం కుదరదు. ఆత్మకూరు నియోజకవర్గంలోని మర్రిపాడు, ఏఎస్ పేట, అనంతసాగరం, సంగం, ఆత్మకూరు, చేజర్ల మండలాల్లో ఏపీడీ ప్రతాప్‌కుమార్ రెడ్డి పర్యవేక్షణ ఇప్పటికే 90శాతం ఈకేవైసీ పూర్తయింది.



శ్రామికులకు ఈకేవైసీ చేస్తున్న ఉపాధి సిబ్బంది

కిలోకి అర కిలోనే..!

- మార్కెట్లలో తూకాల మాయాజాలం
- వ్యాపారులు ఇచ్చిందే కొలత, చెప్పిందే ధర
- దగా పడుతున్న వినియోగదారులు
- చేష్టలుడిగిన తూ.కొ శాఖాధికారులు



● నెల్లూరు నగరంలోని లక్ష్మీపురానికి చెందిన వెంకటేశ్వర్లు, సుభద్ర (పేర్లు మార్పు) దంపతులు చేపలు కొనేందుకు మైపాడురోడ్డులోని చేపలమార్కెట్‌కు వెళ్లారు. కిలో చేపలు ఇవ్వాలని అడిగారు. డబ్బులిచ్చి తీసుకున్న చేపలను అనుమానం వచ్చి బయటున్న దుకాణంలో తూకం వేయించగా అరకిలోనే ఉన్నాయి. ఇదేమిటంటూ వారు ఆ వ్యాపారిని ప్రశ్నించారు. అదంతేనని ఆయన బదులివ్వడంతో చేపలు వెనక్కి ఇచ్చేసి డబ్బులు తీసుకుని ఇంటికి వెళ్లిపోయారు వారు.

ఇది ఓ ఉదాహరణ మాత్రమే.. నెల్లూరు నగరంలోని ఏసీమార్కెట్, డైకస్‌రోడ్డులోని పెద్ద చేపలమార్కెట్, మైపాడు రోడ్డులోని మరో చేపల మార్కెట్... ఇలా ఏ మార్కెట్ తీసుకున్న ఇదే దుస్థితి. మార్కెట్లలో జరుగుతున్న తూనికలు, కొలతలు, ధరల మోసానికి వెంకటేశ్వర్లు, సుభద్ర దంపతులేకాదు... నిత్యం అనేకమంది మోసపోతున్నారు. కిలో కూరగాయలు తీసుకుంటే ముప్పావు కిలోకూడా రావడంలేదు. కిలో రొయ్యలు కొంటే అరకిలో వస్తే గొప్ప, ఇక మటన్ షాపుల్లో అయితే పాతిక కేజీ అయినా తేడా కచ్చితంగా ఉంటుం ది. ఇదిలాఉంటే స్టాన్‌హౌస్‌పేట, నవాబుపేట, పప్పులవీధి, రేబాలవారివీధి ప్రాంతాల్లోని హోల్‌సేల్‌కు నిత్యావసరాల సరుకుల వ్యాపారులదీ ఇదేతీరు. వారిచ్చిన కొలతలు, ధరలకు మనం తీసుకోవాలే తప్ప.. ఇదేంటని అడిగే పరిస్థితి లేదు. బయట మార్కెట్లలో జరుగుతున్న మోసాలు కనపడుతున్నా.. అంతా తెలిసినా.. ఏం చేయలేక, మరో మార్గంలేక విధిలేని పరిస్థితుల్లో ప్రజలు కొనుగోలు చేస్తున్నారు. ఏసీ కూరగాయల మార్కెట్లో అర, పావు కిలోలకు ఎప్పుడో పాతరేశారు. అక్కడ కిలోపైన కొంటేనే వ్యాపారులు కూరగాయలు ఇస్తున్నారంటూ ప్రజలు వాపోతున్నారు. దీన్ని ప్రశ్నించే ధైర్యం కూడా చేయలేమని వారంటున్నారు.

నెల్లూరు(సిటీ), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ప్ర ధాన మార్కెట్లన్నీ మాఫియా చేతుల్లో ఉండటంతో వినియోగదారులకు సరైన కొలతలు,ధరలు అందడం లేదన్న వాదన ఉంది. రాజకీయ నేతలు కొందరు మార్కెట్లలోకి ప్రవేశించి, అక్కడ వ్యాపారులకు అండగా నిలుస్తున్నారు. కొన్నిచోట్ల వారే వ్యాపారులుగా చలామణి అవుతున్నారు. దీంతో మాఫియా గ్యాంగ్‌లతో మార్కెట్లు ఉన్నాయని నగరవాసులు అంటున్నా రు. మార్కెట్‌లో ఏమి కొనుగోలు చేసినా వాటిని తని ఖీ చేసుకునే వెసులుబాటు లేదు. ఎవరికైనా ఫిర్యాదు చేస్తే తక్షణ చర్యలూ ఉండటం లేదు. మార్కెట్లలో తూనికలు, కొలతల్లో భారీగా తేడాలు కనిపిస్తున్నా ఆ శాఖ అధికారులు ఎక్కడ దాడులు చేయకపోవడం పలు అనుమానాలు తావిస్తున్నదని, కనీసం అప్పుడప్పుడు ఆకస్మిక దాడులు చేసినా వ్యాపారుల్లో భయం ఏర్పడుతుందని ప్రజలు అంటున్నారు.

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

మా శాఖ ఇన్స్‌పెక్టర్లు తరచూ దాడులు చేస్తూనే ఉన్నారు. ఎవరైనా వ్యాపారులు అవకతవకలకు పాల్పడినట్లు తేలితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజలు కూడా మార్కెట్లకు వెళ్లినప్పుడు తప్పులు జరిగితే ప్రశ్నించాలి.

- ఐజాక్, తూ.కొ శాఖ డిప్యూటీ కంట్రోలర్

ఆకస్మిక దాడులేవి..?



మార్కెట్లలో వ్యాపారుల వద్ద ఉండే తూకాల యంత్రాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తే బా గుంటుంది. మార్కెట్లలో అంతా మోసమే. విధిలేక కొనాల్సిన దుస్థితి. ఈ మధ్య ఆకస్మిక దాడులు కరువయ్యాయి.

- గాలి వెంకటేష్, వావిలేటిపాడు

ఎవరు పట్టించుకుంటారు...?



మార్కెట్లకు వెళ్లి కొనేది రూపాయి తగ్గుతుందని, కానీ అక్కడ కూడా మోసాలు చేస్తే ఇక పేదలను ఎవరు పట్టించుకుంటారు. ప్రభుత్వం, అధికారులు జోక్యం చేసుకోవాలి. .

- ఈగ చెంచమ్మ, ధనలక్ష్మీపురం

కలాం స్ఫూర్తితో విద్యార్థులు ఎదగాలి

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని గ్రంథాలయాధికారి అల్లాడి నరసింహారావు విద్యార్థులకు సూచించారు. మంగళవారం బుచ్చి శాఖా గ్రంథాలయంలో అబ్దుల్ కలాం 94వ జయంతి నిర్వహించారు. కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కలాం పురస్కార గ్రహీత గండికోట సుధీర్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11907
వెండి కిలో ధర	రూ. 176700
వెండి ఒక గ్రాము	రూ. 185.00

పచ్చని పల్లెల్లో ప్లాస్టిక్ భూతం!

● రోడ్లు, కాలువల్లో పేరుకుపోతున్న వ్యర్థాలు - పట్టించుకోని పంచాయతీ అధికారులు

వెంకటాచలం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాలను సైతం ప్లాస్టిక్ భూతం పట్టి పీడిస్తోంది. ప్లాస్టిక్ వినియోగం రోజురోజుకు పెరగడంతో పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోంది. పర్యావరణ కలుషితం అవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ప్లాస్టిక్‌ను నిషేధించినా అధికారుల నిర్లక్ష్యంతో అది ఆచరణకు నోచుకోవడం లేదు. దీంతో పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో సైతం ప్లాస్టిక్ వినియోగం ఘననీయంగా పెరిగిపోయింది. ఫలితంగా నివాస ప్రాంతాల మధ్యలో, డ్రైనేజీ కాలువల్లో, రోడ్ల పక్కన ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతోన్నాయి. ఆ వ్యర్థాల్లో పశువులతోపాటు పందులు సైతం సంచరిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.


చెముడుగుంట వద్ద చెరువు పక్కనే పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

పంచాయతీ అధికారుల చర్యలు శూన్యం

మండలంలోని చెముడుగుంట, కాకుటూరు, కసుమూరు, కనుపూరు, చవటపాళెం, వెంకటాచలం, కంటేపల్లి, గొలగమూడి, అనికేపల్లి, సర్వేపల్లి, ఇస్కపాళెం, నిడిగుంటపాళెం, గూడ్లూరువారిపాళెం, తాటిపర్తిపాళెం, పూడిపర్తి, ఈదగాలి, ఇడిమేపల్లి తదితర గ్రామాల్లో ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల వాడకం విపరీతంగా పెరిగింది. ఎక్కడ చూసిన కిరణా దుకాణాలతోపాటు ఇతర దుకాణాల్లో కూడా కవర్ల వాడకం ఎక్కువగా ఉంది. దీంతో రోడ్లు, కాలువల్లో ఎక్కడా చూసిన ప్లాస్టిక్ వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. నిషేధాన్ని అమలు చేయాల్సిన పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామాల్లో ప్లాస్టిక్ వాడకం విచ్చలవిడిగా పెరిగిపోయింది. పట్టణాల్లో ఎక్కువ వినియోగించే ప్లాస్టిక్ కవర్ల వాడకం గ్రామాల్లో కూడా విస్తరించడంతో గ్రామాల్లో ఉండే పచ్చని వాతావరణం పాడయ్యే ప్రమాదముంది. దీని వల్ల గ్రామాల్లోని వాతావరణం కూడా కలుషితమవుతుంది. రోడ్లు, కాలువల్లో ఎక్కడా చూసిన ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపో తున్నాయి. అలాగే చెముడుగుంట వద్ద జాతీయ రహదారికి అనుకుని ఉన్న చెరువులో సైతం అక్కడక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. దీంతో కాలువల్లో మురుగు నీరు పోయే దారులు మూసుకుపోతున్నాయి. పట్టించుకోవాల్సిన పంచాయతీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా గ్రామాల్లో ప్లాస్టిక్ అమ్మకాలు, వినియోగాన్ని నిషేధించాల్సిన అవసరం ఉంది.

నాలుగు లేఔట్లకు ఆమోదం

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): లే-అవుట్ రెగ్యులైజేషన్ స్కీం-2020కి కొనసాగింపుగా బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీ పరిధిలో డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ నాలుగు లేఔట్లను ఆమోదించినట్లు మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇస్కపాళెం రెవెన్యూ పరిధిలో 3, వవ్వేరు రెవెన్యూ పరిధిలో ఒక లేఔట్‌ను ఆమోదించినట్లు తెలిపారు. ఈ నాలుగు లేఔట్ల ప్లాన్లను మున్సిపల్ కార్యాలయ నోటీసు బోర్డులో పెట్టినట్టు తెలిపారు. ప్లాట్ల యజమానులు, ప్రజల నుంచి అభ్యంతరాల స్వీకరణకు 15 రోజులు గడువు ఉంటుందని, రాత పూర్వకంగా అభ్యంతరాలు తెలపాలని కోరారు. అభ్యంతరాలేవీ రాని పక్షంలో ఈ నాలుగింటిని ఫైనల్ లే ఔట్లుగా నిర్ధారిస్తామన్నారు.

పోలేరమ్మ జాతర

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీలోని రాఘవరెడ్డి కాలనీలో మంగళవారం పోలేరమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి చద్ది నివేదించి పూజలు జరిపించారు. అనంతరం ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ఓవర్ ట్యాంకు ప్రాంతంలో పోలేరమ్మతల్లి వేప చెట్టువద్ద స్థానిక భక్తులు, జొన్నవాడ ఆలయ ట్రస్టుబోర్డు మెంబర్ ముంగర సుధాకర్ కుటుంబం పోలేరమ్మ తల్లికి పొంగళ్ళు పొంగించి చద్ది (రాగిఅంబలి)తో పాటు పులిహోర సమర్పించారు.

సూపర్ జీఎస్టీ..ఓ వరం!

ముత్తుకూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పేద మధ్యతరగతి ప్రజలకు సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌లో భాగంగా ప్రవేశ పెట్టిన జీఎస్టీ 2.0 వరమని మండల టీడీపీ అధ్యక్షుడు నీలం మల్లికార్జున యాదవ్ తెలిపారు. ముత్తుకూరు ప్రధాన కూడలిలో మంగళవారం సాయంత్రం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమంలో భాగంగా జీఎస్టీ 2.0 సంస్కరణలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రాష్ట్ర డైరెక్టర్లు మునుస్వామి, అల్తాఫ్, మేకల సురేంద్ర, మండల ప్రధాన కార్యదర్శి మాచి రెడ్డి శ్రీధర్‌రెడ్డి, మామిడాల శ్రీనివాసులు, బీసీ సెల్ అధ్యక్షులు పల్లికొండ శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షులు బొలిగర్ల శ్రీనివాస్‌యాదవ్, అక్కయ్యగారి ఏడుకొండలు, గుంజి శ్రీను పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు

టపాసుల విక్రయాలపై పోలీసు అధికారుల హెచ్చరిక

ముత్తుకూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగ సందర్భంగా కృష్ణపట్నం సర్కిల్ పరిధిలో అనుమతులు లేకుండా టపాసులు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవి నాయక్ హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్‌లో మంగళ వారం కృష్ణపట్నం ఎస్‌ఐ శ్రీనివాసులురెడ్డితో కలిసి మాట్లాడుతూ ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అనుమతులు పొందిన దుకాణాల్లోనే టపాసులు విక్రయించాలన్నారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. కృష్ణపట్నం సర్కిల్ పరిధిలో అక్రమ టపాసుల విక్రయాలు జరిగితే సమాచారం ఇవ్వాలని కోరారు.

వెంకటాచలం : బాణసంచా దుకాణాలు నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని వెంకటాచలం సీఐ వీ సుబ్బారావు హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ బాణసంచా దుకాణాల ఏర్పాటులో ఖచ్చితంగా నిబంధనలు పాటించాలన్నారు. అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా, అక్రమంగా ఎక్కడైనా మండలంలో టపాసుల తయారీ నిల్వలు, కేంద్రాలు, గోదాములు, సరఫరా, విక్రయాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. అటువంటి వారిపై కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు.

మనుబోలు: లైసెన్సులు లేకుండా దీపావళికి టపాసులు విక్రయించరాదని ఎస్‌ఐ శివరాకేష్ వ్యాపారస్తులకు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో టపాసుల వ్యాపారస్తులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మండల కేంద్రమైన మనుబోలులో నలుగురు, బద్దెవోలులో ఒకరికి మాత్రమే లైసెన్సులు ఉన్నాయన్నారు. లైసెన్సులు లేకుండా దొంగచాటుగా టపాసులు అమ్మితే దాడుల్లో పట్టుబడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. లైసెన్సుల వ్యాపారులు నిబంధనలు పాటించాలన్నారు. ప్రమాదాలు జరగకుండా తప్పకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు.

పర్యాటక రంగానిదే కీలక పాత్ర

వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ సునీత

వెంకటాచలం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : భారత దేశ అభివృద్ధిలో పర్యాటక రంగం ఎంతో కీలకపాత్ర పోషిస్తుందని వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు అన్నారు. వీఎస్‌యూలో మంగళవారం పర్యాటక రంగంపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. పుస్తకాన్ని వీఎస్‌యూ వీసీ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పర్యాటక రంగం ఆర్థిక స్థిరత్వానికి కొత్త మార్గాలను సృష్టిస్తుం దన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యసాధనలో పర్యాటక రంగం కీలకమైందన్నారు. యువత ఈ రంగంలో సృజనాత్మక ఆలోచనలతో ముందుకు రావాలన్నారు. గ్రామీణ పర్యాటక రంగం అభివృద్ధి చెందితే స్థానిక వృత్తులు, కళలు, సాంప్రదాయాలు, ఆచారాలు మళ్లీ జీవం పోసుకుంటాయన్నారు. ఈ పుస్తకం గ్రామీణ పర్యాటకాన్ని సుస్థిర జీవనోపాధితో అనుసంధానించే విలువైన మార్గదర్శకంగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, పర్యాటక విభాగాధిపతి డాక్టర్ పీ సుజాత, ప్రొఫెసర్ జవహర్ బాబు, డాక్టర్ కోట నీలమణికంఠ, ఎం విక్రమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీవన ఎరువుల వినియోగంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

కోవూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పాటూరు గ్రామంలో మంగళవారం రైతులకు కృషి విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో జీవన ఎరువులపై అవగాహన కల్పించారు. తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ విశ్వవిద్యాలయం సహాయ సంచాలకులు డాక్టర్ సుమతి మాట్లాడుతూ సేంద్రియ ఎరువులు వాడకపోతే పొలం జీవం కోల్పోతుందన్నారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని 25 శాతం తగ్గించు కోవాలన్నారు. సూక్ష్మ పోషకాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ లలిత శివ జ్యోతి, వ్యవసాయాధికారులు అనిత, రజని, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు కిరణ్‌కుమార్ రెడ్డి, విజయకుమార్ నాయక్ పాల్గొ న్నారు.

సొంత ఆదాయ వనరులపై శిక్షణ

వెంకటాచలం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళ వారం సొంత ఆదాయ వనరులు అనే అంశంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీడీవో కల్పన హాజరై మహాత్మా గాంధీ, డాక్టర్ అంబేద్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. పంచా యతీ కార్యదర్శులు, సర్పంచులకు సొంత ఆదాయ వన రులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ షేక్ ముషీదర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో బకింగ్ హాం కెనాల్ పూడికతీత

కృతజ్ఞతలు తెలిపిన మత్స్యకారులు

విడవలూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చొరవతో సముద్రం లోనికి వేళ్లే బకింహాం కెనాల్‌లో పూడికతీత పనులు జరిగాయని ఊటుకూరు పెద్దపాళెం గ్రామ మత్స్యకారులు తెలిపారు. గ్రామంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. బకింహాం కెనాల్ ఎన్నో సంవత్సరాలుగా పూడిపోయి వేటకి సముద్రం లోనికి వెళ్లటానికి నానా ఇబ్బందులు పడాల్సి వచ్చిందన్నారు. ఈ సమస్యను కోవూరు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా, స్పందించిన ఎమ్మెల్యే వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఎక్స్‌వేటర్లు ఏర్పాటు చేసి కెనాల్‌లో పూడిక తీత పనులు చేయించారన్నారు. మత్స్యకారుల సమస్యలను పరిష్కరించిన ఎమ్మెల్యేకి రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాపులు మీనంగారి బాబు, మీనంగారి తిరుపతయ్య, కొండూరు చిరంజీవి, అక్కయగారి నరసింహ, శ్రీహరికోట నాగభూషన్, సర్పంచు మేకల పోలయ్య, నాయకులు ముక్కంటి తాతాయ్య, కొండూరు వెంకటేశ్వర్లు, సున్నపు పాపారావు, రోశయ్య పోలయ్య పాల్గొన్నారు.

ఆదాయ వనరులపై దృష్టి సారించాలి

విడవలూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలో ఆదాయ వనరులపై సర్పంచు, కార్యదర్శులు దృష్టి సారించాలని ఎంపీడీవో నగేష్‌కుమారి తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీల్లో ఆదాయ వనరులను ఏ విధంగా సృష్టించుకోవాలన్న అంశంపై మంగళవారం గ్రామ సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణా తరగతులను నిర్వహించారు. రెండురోజుల పాట జరగనున్న శిక్షణా తరగతుల్లో మొదటి రోజు ఎంపీడీవో నగేష్‌కుమారి పాల్గొని సూచనలు, సలహాలను అందజేశారు. పంచాయతీలో నిరుపయోగంగా ఉన్న భవనాలను గుర్తించి వాటిని అద్దెకు ఇవ్వటం ద్వారా పంచాయతీకి ఆదాయం వస్తుందన్నారు. పంచాయతీ పరిధిలో గుంతల పూడ్చివేత వంటి మరమ్మతులు చేస్తే వేలం పాటల ద్వారా అదనపు ఆదాయం వస్తుందన్నారు. మరమ్మత్తులకు గురైన దుకాణాలను గుర్తించాలన్నారు. రోడ్డు పక్కన పంచాయతీ స్థలాలు ఉంటే ఆ స్థలాల్లో దుకాణాలను నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ట్రైనర్లు సుమంత్, కిరణ్మయి, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పొదలకూరులో పోషణ్ మహా కార్యక్రమం

పొదలకూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నరసారెడ్డి కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సీడీపీవో విజయలక్ష్మి ఆదేశాలతో మంగళవారం పోషణ్ మహా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని మాసోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో పోషణ్ మహా కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది సీహెచ్ రవి, రూప, అంగన్‌వాడీ సిబ్బంది లక్ష్మీ, రత్నమ్మ, మణెమ్మ, కుమారి, రమాదేవి, అమరావతి, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

గొలగమూడిలో సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా పూజలు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కన్నా

వెంకటాచలం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన గొలగమూడిలోని భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమాన్ని మంగళవారం సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో కన్నా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయితే ఆశ్రమ ఈఓ బాలసుబ్రహ్మణ్యం తొలుత కన్నాకు స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం కన్నాకు తీర ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ యువమోర్చా మండలాధ్యక్షుడు గోత్తల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక, మట్టిని తవ్వితే కఠిన చర్యలు


రహదారికి గండి కొడుతున్న పోలీసులు

విడవలూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముదివర్తి గ్రామంలో అనుమతులు లేకుండా ఇసుక, మట్టిని తవ్వితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు చంద్రశేఖర్, ఎస్‌ఐ నరేష్‌కుమార్ యాదవ్ తెలిపారు. ముదివర్తి సమీపంలోనున్న పెన్నాతీరంలో కొందరు వ్యక్తులు అనుమతులు లేకుండా ఇసుకని, మట్టిని తరలిస్తున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు అధికారులు ముదివర్తి ఇసుకరీచ్‌లో ఎటువంటి తవ్వకాలు జరగకుండా, ట్రాక్టర్లు వెళకుండా జేసీబీ సహాయంతో రహదారికి గండి కొట్టారు. ఈ సందర్భంగా తహసీల్దారు, ఎస్‌ఐ మాట్లాడుతూ ముదివర్తిలో ఇసుకని, మట్టిని తరలించ టానికి ఎటువంటి అనుమతులు లేవన్నారు. ఒకవేళ ఎవరైనా తవ్వకాలు జరిపితే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

చెరువుల ఆక్రమణల తొలగింపు

మనుబోలు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): చెరువులను ఆక్రమిస్తే ఎవరైనా సరే ఊరుకునేది లేదని 14 చెరువుల నీటిసంఘం అధ్యక్షుడు ఏకొల్లు కోదండ రామిరెడ్డి హెచ్చరించారు. ఇటీవల ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చెరువుల ఆక్రమణలపై సర్వే చేయించారు. ఇందులో బాగంగా బండేపల్లి చెరువు వద్ద ఉన్న ఆక్రమణలను ఎస్కవేటర్ సాయంతో ఇరిగేషన్ ఏఈ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంగళవారం తొలగించి ఫెన్సింగ్ వేయించారు. బండేపల్లి బ్రాంచ్ కనుపూరు కెనాల్ కాలువ కింద ఉండే 14 చెరువులను సర్వేచేయించి తప్పనిసరిగా ఆక్రమణలను తొలగిస్తామని ఏకొల్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటిసంఘం ఉపాధ్యక్షుడు వెందోటి భాస్కర్‌రెడ్డి, బండేపల్లి టీడీపీ నాయకులు ఉడతా రవి, యరగల రవి తదితరులు పాల్గొన్నారు.

యువత సేవా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి



సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్న శివకుమార్

రాపూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): యువత సేవా స్ఫూర్తితో ఉండాలని, విద్యార్థి దశ నుండే సేవభావం, సామాజిక భాద్యత, దేశ భక్తి కలిగి ఉండాలని రాపూరు పశువర్ధక శాఖ కళాశాల ప్రిన్సిపాల్ శివకుమార్ తెలిపారు. మంగళవారం నాడు మండలంలోని బొజ్జనపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, సచివాలయం నందు జాతీయ సేవ సంస్థ (ఎన్ఎస్ఎస్) ద్వారా 'పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమం' నిర్వహించారు. పశువర్ధక కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థిని, విద్యార్థులు మొక్కలు నాటి, సంరక్షణ కోసం కంచె వేశారు. పాఠశాల, సచివాలయం ఆవరణలో ఉన్న చెత్తను సేకరించి శుభ్రపరిచారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివకుమార్ మాట్లాడుతూ యువత సేవా కార్యక్రమాల్లో ముం దుండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బొజ్జనపల్లి పంచా యతీ సర్పంచ్ నాగభూషణ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు హజ రత్తయ్య, పశువర్ధక కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

రైలు ఢీకొని ఉపాధ్యాయిని మృతి


పద్మావతి (ఫైల్)

నెల్లూరు(క్రైం), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రైలు గేటు వేసుంది... అంతా వాహనాలను గేటు ముందు నిలిపి ఉన్నారు...అయితే ఓ మహిళ మాత్రం గేటు వేసున్నా ముందుకు అడుగులు వేసింది...అమ్మా రైలు వస్తూంది... ఆ గండి అంటూ... అంతా కేకలు వేస్తున్నా నిలిచి ఉన్న గూడ్స్ రైలును చూస్తూ ఆ పక్కన వస్తున్న మరో రైలును చూడకుండా ముందుకు అడుగులు వేసి ప్రమాదవశాత్తు రైలు కింద పడి ఓ ఉపాధ్యాయురాలు మంగళ వారం సాయంత్రం మృతి చెందారు. రైల్వే పోలీసుల కథనం మేరకు, నగరంలోని త్యాగరాజునగర్‌లో రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ రామాంజనేయులు, పద్మావతి(50) దంపతులు. వారికి ఇద్దరు కుమార్తెలు. వారికి వివాహాలు అయ్యి వేరే ప్రాంతాల్లో ఉన్నారు. పద్మావతి మనుబోలు మండలం కొలనుకుదురు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఎప్పటిలానే మంగళవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన పద్మావతి పాఠశాల ముగిసిన తర్వాత సాయంత్రం నెల్లూరుకు చేరుకున్నారు. వేదాయపాలెం రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న రైల్వే గేటు గుండ ఇంటికి వెళుతుండగా గేటు మూసి ఉంది. ఈ సమయంలో గేటు దాటి ముందుకు సాగిన పద్మావతి ఓ గూడ్స రైలు ఆగి ఉండటం చూసి అడుగులు ముందుకు వేసింది. అదే సమయంలో మరో రైలు వేగంగా వచ్చి పట్టాలు దాటుతున్న ఉపాధ్యాయురాలిని వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో పద్మావతి అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్‌ఐ హరిచందన సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం అందుకున్న పద్మావతి కుటుంబసభ్యులు మార్చురీకు చేరుకొని కన్నీరుమున్నీరయ్యారు.

గుర్తుతెలియని వ్యక్తి ...

నెల్లూరు(క్రైం) అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నగరంలోని వేదాయపాలెం- నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్ల మధ్య కొండాయపాలెం గేటు సమీపంలో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసుల కథనం మేరకు, గుర్తుతెలియని వ్యక్తి(50) కొండాయపాలెం సమీపంలో ఉద్దేశ్యపూర్వకంగా నెల్లూరు మెమో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న స్థానికులు రైల్వే సిబ్బందికి తెలియ చేశారు. రైల్వే ఎస్‌ఐ ఎన్ హరిచందన సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు తెలుపు రంగు ఫుల్ హ్యాండ్స్ షర్ట్, బులుగురంగు చెక్స్ లుంగీ ధరించి ఉన్నాడు.

బైకుల ఢీ.. ముగ్గురికి తీవ్ర గాయాలు

దుత్తలూరు(ఉదయగిరి), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ గ్రామ సమీపాన రిలయన్స్ పెట్రోలు బంకు వద్ద 565 జాతీయ రహదారిపై మంగళవారం రెండు మోటారు బైకులు ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా గుంటపల్లికి చెందిన నవీన్, డానియేల్, రాజులు పని నిమిత్తం దుత్తలూరు వైపు వస్తుండగా వరికుంటపాడు మండలం తిమ్మారెడ్డిపల్లికి చెందిన అబ్దుల్ బాషా కావలి నుంచి స్వగ్రామానికి వెళుతున్నాడు. ఈ తరుణంలో రిలయన్స్ పెట్రోల్‌బంకు వద్ద రహదారికి మరమ్మతులు జరుగుతుండగా ప్రమాదవశాత్తు రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అబ్దుల్‌బాషా, నవీన్, డానియేల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని హైవే అంబులెన్స్‌లో స్థానిక పీహెచ్‌సీకి తరలించారు.

భారీగా గంజాయి పట్టివేత

● రెండు ఆర్టీసీ బస్సుల్లో 23 కిలోల స్వాధీనం


పట్టుబడిన నిందితులు, పక్కనే గంజాయి ప్యాకెట్లు

వెంకటాచలం, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలం సమీపంలోని టోల్ ప్లాజా వద్ద మంగళవారం ఉదయం ప్రొహిబిషన్, ఎక్సైజ్ (ఎన్ఫోర్స్‌మెంట్) నెల్లూరు - 2 ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భం గా ఏపీ40జెడ్0758 ఆర్టీసీ బస్సులో తనిఖీలు చేయగా వెస్ట్ బెంగాల్ రాష్ట్రం ముషీరాబాద్ జిల్లాకు చెందిన ప్రశాంత మండల్, రఫీకుల్ ఇస్లాం, బాపన్ సెఖ్ అనే ముగ్గురు నిందితులు 18 కిలోల గంజా యిని తరలిస్తున్నట్లు గుర్తించారు. ఎక్సైజ్ పోలీసులు తమదైన శైలిలో విచారించగా కేరళ రాష్ట్రంలోని పెరుంబవూర్‌కు చెందిన షోమ్మి అనే వ్యక్తికి ఇచ్చేందుకు ఒరిస్సా నుంచి తీసుకుని వస్తున్నట్లు తెలిపారు. భద్రాక్‌లో ఒక వ్యక్తి ఒక్కొక్కరికి రూ.3 వేలు చొప్పున తమకు కూలి ఇస్తామని చెప్పడంతోనే తాము గంజాయిని రవాణా చేస్తున్నట్లు నిందితులు పేర్కొన్నారు. అలాగే ఏపీ39యుజెడ్5544 ఆర్టీసీ బస్సును కూడా నిలిపి తనిఖీలు చేయగా ఆ బస్సులో కర్ణాటక రాష్ట్రంలోని హసన్ జిల్లాకు చెందిన అప్పాజీ గౌడ్ అనే వ్యక్తి విశాఖపట్నంలో దినేష్ అనే వ్యక్తి నుంచి కేజీ రూ. 6 వేలు చొప్పున 5 కిలోల గంజాయిని కొనుగోలు చేసి తన సొంత గ్రామంలో అధిక ధరకు విక్రయించేందుకు తీసుకుని వెళ్తుండగా ఎక్సైజ్ పోలీసులు పట్టుకు న్నారు. ఎక్సైజ్ పోలీసులు చేపట్టిన వేరువేరు తనిఖీల్లో రెండు ఆర్టీసీ బస్సుల్లో 23 కేజీల గంజాయిని తరలిస్తున్న నలుగురు నిందితులను ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారినుండి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను నెల్లూరు - 2 ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ దాడుల్లో సీఐలు పీ అనిత, పీ ప్రసన్నలక్ష్మి, సయ్యద్ కాలేషావలి, ఎస్‌ఐ పూర్ణకుమార్, హెచ్‌సీలు ఎన్ ప్రసాద్, ఎం కిరణ్ సింగ్, పీసీలు ఎన్ మునిరాజ్‌కుమార్, టీ సుబ్రహ్మణ్యం, డీ గిరిబాబు, వై మురళీమోహన్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి పాడిగేదె మృతి

బిట్రగుంట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం ముంగమూరుకు చెందిన రైతు మారుబోయిన మాల్యాద్రికి చెందిన పాడి గేదె మంగళవారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. బాధితుడి వివరాల మేరకు.. ఆయన తెల్లగుంట గ్రామంలోని తాగేటి చెరువు వద్ద పశువులను మేతకు తోలుకెళ్లాడు. పొర్లుకట్టపై ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి రొయ్యల గుంటకు వేసిన విద్యుత్ తీగలు రెండు అడుగుల ఎత్తులో ఉండటంతో ఆ తీగలు తగిలి గేదె మృతి చెందింది. దీనిని పదిహేను రోజుల క్రితమే రూ. 1.10 లక్షలతో కొనుగోలు చేసినట్లు బాధితుడు తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు మాల్యాద్రి తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

● 9 మంది అరెస్టు

కావలి రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం మునునూరు సమీపంలో మంగళవారం పేకాట స్థావరంపై రూరల్ పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో సీఐ రాజేశ్వరరావు ఆదేశాల మేరకు ఎస్‌ఐ బాజీబాబు తన సిబ్బందితో కలసి నిర్వహించిన ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.18,400 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా పేకాట, కోడిపందేలు, గంజాయి వంటి మత్తు పదార్థాలు అమ్ముతున్నట్లైతే సమాచారమివ్వాలని సీఐ తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	122
స్కిన్ చికెన్	222
స్కిన్‌లెస్	244

కోడిగుడ్ల ధర (100): 525

'ఏబీసీ'కి కుక్కలు

నెల్లూరురూరల్, అక్టోబరు 14,(ఆంధ్రజ్యోతి) : నగరంలో మందలుగా తయారవున్న కుక్కలను నిలువరించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎన్ఎంసీ పశువైద్యుడు మదన్‌మోహన్ తెలిపారు. ఇందులో భాగంగా నగరంలోని కేవీఆర్, పోలీసుమైదానం, డీకేడబ్ల్యు ప్రాంతాల్లో సంచరిస్తున్న కుక్కలను పట్టుకుని పాతమున్సిపల్ కార్యాలయంలో ఉన్న ఏబీసీ (యాంటీ బ్రీడింగ్ సెంటర్)కు తరలిస్తున్నామన్నారు. అక్కడ సంతానోత్పత్తి లేకుండా చికిత్స చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా 15 పశువులను రోడ్ల పై సంచరిస్తుండగా పట్టుకుని కల్లూరిపల్లి గోశాలకు, మరో 22 కోతులను పట్టుకుని బద్వేల్ అటవీ ప్రాంతానికి తరలించామన్నారు.



18న గ్రామసభ

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయం పునఃనిర్మాణం జరగనున్నది. ఈ సందర్భంగా ఈనెల 18న దేవదాయ శాఖ ప్రాంతీయ కమిషనర్ తిరుపతి ఆధ్వర్యంలో ఉదయం 11గంటలకు ఆలయ ప్రాంగణంలో గ్రామసభ నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ మజ్జిగ చంద్రమౌళీరెడ్డి, ఆలయ ఏసీ శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గ్రామసభకు మూలాపేట వాసులు, ఆస్తిక మహాశయులు విచ్చేసి సూచనలు అందచేయాలని కోరారు.

ప్రధాని సభ ఏర్పాట్లలో గిరిధర్



టీడీపీ నాయకులతో గిరిధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, అక్టోబరు 14,(ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ ప్రయోజనాలను ప్రజలకు వివరించేందుకు కర్నూలులో ఈనెల 16న నిర్వహించనున్న ప్రధాని మోదీ సభా ఏర్పాట్లను నెల్లూరుకి చెందిన టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. టీడీపీ రాష్ట్ర ముఖ్యనేతలతో కలిసి సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. కర్నూలు జిల్లా ప్రజాప్రతినిధులతో కలిసి ఏర్పాటు చేసిన సన్నాహక కమిటీలో ఆయన సభ్యుడిగా ఉన్నారు. దీంతో కొన్ని రోజులుగా సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. 17 నుంచి రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన అందుబాటులో ఉంటారని కార్యాలయ వర్గాలు మంగళవారం తెలిపాయి.

ఏపీలో గూగుల్ డేటా సెంటర్ ప్రతిష్ఠాత్మకం

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌లో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకోవటం ఎంతో ప్రతిష్ఠాత్మక విషయమని భారత్ సేవా ఫౌండేషన్ కార్యదర్శి షేక్ ఖాసీం ఒక ప్రకటనలో అన్నారు. ఏపీ చరిత్రలో ఇది ఒక సువర్ణ అక్షరాలతో లిఖించదగిన అధ్యాయంగా ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్ కృషి వల్లనే విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కాబోతోందని హర్షం వ్యక్తం చేశారు.

రేపు మండల కో ఆర్డినేటర్ల సమావేశం

సంగం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక జీబీ కేఆర్ జడ్పీ పాఠశాలలో గురువారం ఉదయం 10 గంటలకు ఆత్మకూరు డివిజన్‌లోని అన్ని మండలాల కోఆర్డినేటర్ల సమావేశం జరుగుతుందని డివిజన్ కోఆర్డినేటర్ మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి వచ్చే మండలాల కోఆర్డినేటర్లు మండలస్థాయిలో జరిగిన ఎస్‌జీఎఫ్ (స్కూల్ గ్రేమ్స్ ఫెడరేషన్) టోర్నమెంట్ ఎంపిక జాబితాను తీసుకు రావాలని తెలిపారు. సందేహాలుంటే 9494640181ను సంప్రదించాలని కోరారు.

నిబంధనలు పాటించాలి

సంగం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): లైసెన్సు కలి గిన బాణాసంచా దుకాణదారులు దుకాణాల ఏర్పా టు, బాణాసంచా విక్రయాల్లో ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సీఐ వేమారెడ్డి హెచ్చరించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఆయన లైసెన్సు కలిగిన బాణాసంచా దుకాణదారుల తో సమావేశం నిర్వహించి నియమ నిబంధనలను వివరించారు. ఇళ్లలో బాణాసంచా నిల్వ చేయడం, ఇళ్ల మధ్య విక్రయించడం చేస్తే కఠిన చర్యలు, క్రిమి నల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సంగం మండల పరిధిలోని ముంబై జాతీయ రహ దారిపై అధిక వేగంగా వెళ్లే వాహనాల వల్ల తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, దానిని నియంత్రించేందుకు స్పీడ్‌గన్ ఏర్పాటు చేశామన్నారు. దీని ద్వా రా అధిక వేగంతో వెళ్లే వాహనదారులను గుర్తించి రూ.2వేల వరకు జరిమానా విధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగం, ఏఎస్‌పేట, చేజర్ల ఎస్‌ఐ లు, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

అతిక్రమిస్తే చర్యలు

కలువాయి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసే టపాసుల దుకాణదారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామ ని ఎస్‌ఐ ఎస్ కోటయ్య హెచ్చరించారు. దుకాణాల ను జనావాసాల మధ్య కాకుండా వారికి కేటాయించిన స్థలంలోనే ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడైనా లైసెన్స్ లేకుండా బాణాసంచా నిల్వ చేసినా, విక్ర యించినా వారి కేసులు నమోదు చేస్తామని తెలి పారు.

అనుమతులు తప్పనిసరి

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), (ఆంధ్రజ్యోతి): బాణాసంచా దుకాణాదారులు త ప్పనిసరిగా అనుమతులు పొందాలని ఎస్‌ఐ రఘునాథ్ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

భక్తిశ్రద్ధలతో కాత్యాయనీ వ్రతం





కాత్యాయినీగా రాజరాజేశ్వరి, కాత్యాయనీ వ్రతంలో పాల్గొన్న భక్తులు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో మంగళవారం కాత్యాయినీ వ్రతం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి అభిషేకాలు, విశేష పూజలు, సుందరేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి. పూలంగిసేవలు నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. రాహుకాల పూజలు కనుల పండువగా జరిగాయి. ఈ కార్యక్రమాలను ఏసీ కోవూరు జనార్ధన్‌రెడ్డి, ప్రధాన అర్చకులు రఘురామమూర్తి, అర్చకులు, సిబ్బంది, పర్యవేక్షించారు.

అబ్దుల్ కలాం ఎక్స్‌లెన్స్ అవార్డుల ప్రదానం



అబ్దుల్‌కలాం ఎక్స్‌లెన్స్ అవార్డు గ్రహీతలతో అతిథులు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం దేశ అంతరిక్ష ప్రయోగాలకు ఎంతగానో కృషి చేశారని మదీనా వాచ్ అధినేత డాక్టర్ షేక్.ఇంతియాజ్ పేర్కొన్నారు. పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం నగరంలోని శ్రీరేబాల లక్ష్మీనరసారెడ్డి స్మారక భవనం (టౌనుహాలు)లో డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలామ్ జయంతి, శ్రీనందికేశ్వర కూచిపూడి కళాక్షేత్రం ప్రారంభోత్సవం జరిగాయి. ఈ సందర్భంగా అబ్దుల్ కలామ్ ఎక్సలెన్స్ అవార్డు ప్రదానం జరిగింది. ముందుగా అబ్దుల్ కలాం చిత్రపటానికి అతిథులంతా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దేవసాని కొండారెడ్డి, పీఎల్.రావు, పందిటి సుబ్బయ్య, తిరుమలశెట్టి లక్ష్మీనారాయణ, ఎం.వెంకటరమణయ్య, డాక్టర్ రాచపాలెం రఘు, దూబిశెట్టి కళ్యాణి, జె.త్యాగరాజు, మరుపూరు రమేష్, ఎస్.మాధవిలను అబ్దుల్ కలాం ఎక్సలెన్స్‌ల అవార్డుతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రియల్ ఎస్టేట్ అధినేత ఏఎం.రత్నం, ఎస్.వి.రమేష్‌బాబు, ఏ.జయప్రకాష్, ఎన్.బలరామయ్యనాయుడు, కె.మురళీమోహన్‌రాజు, పాల జోష్న, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు నిర్వహణ సంతోషకరం



మాట్లాడుతున్న కార్పొరేటర్ రామకృష్ణ

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ పర్యవేక్షణలో నారాయణ ఆసుపత్రి ఆన్ వీల్స్ వైద్య శిబిరాలకు శ్రీకారం చుట్టడం సంతోషదాయకమని 47వ డివిజన్ కార్పొరేటర్ పొట్టూరు రామకృష్ణ పేర్కొన్నారు. డివిజన్‌లోని కుక్కలగుంట మహలక్ష్మీగుడి వద్ద మంగళవారం వైద్యశిబిరం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.1కోట్ల వ్యయంతో అత్యాధునిక సాంకేతిక వైద్య పరికరాలతో ఆన్ వీల్స్ మెడికల్ వాహనం ఏర్పాటు చేసి నగరంలోని అన్ని డివిజన్లలో వైద్య సేవలు అందించడం హర్షనీయమన్నారు. వైద్యులు ఉచితంగా బీపీ, షుగర్, స్కానింగ్, ఈసీజీ, కంటి పరీక్షలు వంటి పలు సేవలను అందిస్తున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు చెంగయ్య, యూనిట్ ఇన్‌ఛార్జి రెహమాన్, రాజా, కార్యదర్శి నరేంద్ర, గిరిధర్, అల్లంపాటి వెంకటరమణ, సురేష్, ప్రసాద్, అహ్మద్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పవన్ ఆశయాల కోసం పనిచేస్తాం..



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న జనసేన నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో జనసేన పార్టీలో కొన్ని దుష్టశక్తులు పాలన సాగిస్తున్నాయని, ఎన్ని ఇబ్బందులు వచ్చినా డీసీఎం పవన్‌కళ్యాణ్ ఆశయాల కోసం పనిచేస్తామని ఆ పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు అన్నారు. నగరంలోని మాగుంట లేవుట్‌లోని లక్ష్మి శ్రీనివాస కళ్యాణ మండపంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, నెల్లూరు డివిజన్ ఇన్‌చార్జ్‌లు, జనసైనికులతో మంగళవారం ఆత్మీయసమావేశం జరిగింది. ఈ సమావేశంలో సుజయ్‌బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే కొంత మంది జనసేన అంటే తామే అన్నట్లుగా కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారన్నారు. వైసీపీ రౌడీపాలనలో జనసేన జెండా మోసిన వారందరూ తమ దగ్గరే ఉన్నారని తెలిపారు. కొన్ని దుష్టశక్తుల నోర్లు మూయించేందుకే ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు, ఆశయాల కోసం పనిచేస్తామని, ఎవరినైతే జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తారో వారి వెంట నడిచేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. జిల్లాలో పదికిపది సీట్లు కూటమి ప్రభుత్వానికి రావడానికి జన సైనికుల కష్టం ఎంతో ఉందన్నారు. అధికారం ఉన్నా లేకున్నా జనసేనలోనే ఉండి పనిచేసేందుకు అందరం సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

కల్తీ మద్యం తయారీకి బీజం వేసింది వైసీపీయే...

ఉదయగిరి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం లో కల్తీ మద్యం తయారీకి బీజం వేసింది గత వైసీపీ ప్రభుత్వమే నని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్య దర్శి పొన్నెబోయిన చెంచలబాబు యా దవ్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయగిరిలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులతో కలిసి వ్యాపారస్తులు, ప్రజ లకు అవగాహన కల్పించారు. కరపత్రా లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీ పీ నాయకుల తీరు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందన్నారు.

ఆర్థిక వనరులు పెంచుకోవాలి

పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ

ఉదయగిరిలో హాజరుకాని సర్పంచులు

సీతారామపురం , అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధికి సొంత ఆదాయ వనరులు సమకూర్చుకోవాలనే అంశంపై పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులకు ప్రభుత్వం శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. పలు మండలాల్లో మంగళవారం ఈ కార్యక్రమాలు జరిగాయి. సీతారామపురంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో చంద్రశేఖర్ అధ్యక్షతన సొంత ఆదాయ వనరులపై శిక్షణ ఇచ్చారు. స్థానిక సంస్థల ఆర్థిక స్థిరత్వాన్ని పెంపొందించేందుకు స్వీయ ఆదాయ వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం అవసరమని అధికారులు పేర్కొన్నారు. ఆస్తి పన్ను, మార్కెట్ ఫీజులు, భవన అనుమతులు, నీటి వినియోగ చార్జీలు వంటి అంశాలను వివ రించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రామ్‌నాథరెడ్డి, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సంగంలో...

సంగం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్‌పై పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఎంపీడీవో షాలెట్ ప్రారంభించారు. పంచాయతీలను బలోపేతం చేయడానికి, స్థానిక స్వపరిపాలన మెరుగు పరచడానికి వనరులను సద్వినియోగం చేసుకుని సంపద (ఆదాయం) సృష్టించే అంశాలపై వివరించారు. అనంతరం జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన ఇద్దరు కార్యదర్శులు టీ. మల్లికార్జున, రాజులు పంచాయతీకి ఆర్థిక బలోపేతానిచ్చే పన్నులు, ఫీజులు, అద్దెలు వంటి వనరుల ద్వారా సొంత ఆదాయాన్ని ఎలా పెంపొందించుకోవాలనే అంశంపై వివరించారు. మండలంలోని 20 మంది సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కలువాయిలో..

కలువాయి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలు సొంతంగా ఆదాయం పెంచుకునే మార్గాలపై సర్పంచులు, కార్యదర్శులకు మంగళవారం అధికారులు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇంటి పన్నులు సక్రమంగా వసూలు చేయడంతో పాటు ఇతర ఆదాయ వనరులను ఏర్పాటు చేసుకోవాలని ఎంపీడీవో శైలజ సూచించారు. డిప్యూటీ ఎంపీడీవో రమేష్ పాల్గొన్నారు.



సర్పంచులు హాజరు కాకపోవడంతో ఖాళీ కుర్చీలు

ఉదయగిరి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్త్రీశక్తి భవనంలో పంచాయతీల అభివృద్ధికి సొంత ఆర్థిక వనరులను పెంపొందించుకోవడం ఎలా అనే అంశంపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. అయితే మండలంలో 17 పంచాయతీలు ఉండగా ఒక సర్పంచ్, ఇద్దరు బినామీ సర్పంచులు మాత్రమే హాజరయ్యారు. పంచాయతీ కార్యదర్శులు అందరూ హాజరయ్యారు. శిక్షణకు సర్పంచులే రాకపోతే ఎలా? అని పలువురు విమర్శిస్తున్నారు. ఎంపీడీవో బీ శ్రీనివాసులు, ఏవో పద్మజ తొలుత గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి శిక్షణ ప్రారంభించారు.

దుత్తలూరులో...

స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమా వేశ మందిరంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీవో చెంచమ్మ ప్రారంభించారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

అనంతసాగరంలో..

అనంతసాగరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరు చేసే నిధులతో గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపించాలని ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అభివృద్ధి కార్యాచరణ వివరాలు తెలియజేశారు. ఈవోపీఆర్డీ రామచంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో భారీ ఊరట



చిరు వ్యాపారితో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరురూరల్, అక్టోబరు 14,(ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ తగ్గింపుతో పేద, నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు భారీ ఊరట లభించిందని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నెల్లూరు సిటీలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుపై ప్రజల్లో చర్చ జరగాలన్నారు. కేంద్రంలోని ప్రధాని మోదీ తీసుకున్న ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా ప్రజలకు ఆర్థిక లబ్ధిని చేకూర్చిందని తెలిపారు. దీనిపై ప్రజలు అవగాహన చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ భానుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేశ్‌తో ఎంపీ వేమిరెడ్డి



నారా లోకేష్‌తో కరచాలనం చేస్తున్న ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : ఐటీ దిగ్గజ సంస్థ గూగుల్ విశాఖలో అడుగు పెట్టేలా అనుబంధ సంస్థ రైడన్ ప్రతినిధులతో ప్రభుత్వం ఎంఓయూ కుదుర్చుకుంది. కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, అశ్వినీ వైష్ణవ్ సమక్షంలో గూగుల్ సంస్థ ప్రతినిధులతో సీఎం చంద్రబాబునాయుడు, ఐటీ శాఖా మంత్రి లోకేష్ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఢిల్లీలోని తాజ్‌మాన్‌సింగ్ హోటల్‌లో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఇతర కేంద్ర మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి--సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌లతో ప్రత్యేకంగా మాట్లాడారు.

ఎంఐహెచ్‌ఎం ఫంక్షన్ హాలు మూత



మూతపడ్డ కల్యాణ మండపం

నెల్లూరు(సిటీ), అక్టోబరు 14,(ఆంధ్రజ్యోతి) : నగరంలోని కోటమిట్ట వద్దనున్న ఎంఐహెచ్‌ఎం ఫంక్షన్ హాలును మూతేసినట్లు డీసీపీ రఘునాథరావు తెలిపారు. అనధికారికంగా ఉన్న ఈ ఫంక్షన్ హాలు హైకోర్టు ఉత్తర్వుల్లో భాగంగా కార్యచరణ మేరకు కమిషనర్ నందన్ ఆదేశాలను అనుసరించి హాలు యాజమాన్యం సమక్షంలో సీజ్ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ప్లానింగ్, రెవెన్యూ, ఎలక్ట్రీల్ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారని ఆయన తెలిపారు.

కమనీయం.. అశ్వత్థ నారాయణ కల్యాణం



అశ్వత్థ నారాయణ కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

నెల్లూరు (సాంస్కృతికం) అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కొత్తూరు శ్రామికనగర్‌లోని భగవాన్ వెంకయ్యస్వామి ఆలయ 22వ ఆరాధనోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉదయం సుప్రభాతసేవ, గణపతిహోమం, గణపతి పూజ, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేష పూజలు, అలంకారం భక్తులకు సర్వదర్శనం జరిగింది. ఈ సందర్భంగా అశ్వత్థ నారాయణ కల్యాణం కనుల పండువగా జరిగింది. అనంతరం అన్న ప్రసాద వితరణ రాత్రి భజనలు, పల్లకీసేవ, సాంస్కృతిక కార్యక్రమాలు, శ్రీకృష్ణరాయభారం (పడకసీను) నాటక ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమాల్లో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాలను ఉభయకర్తలు, దేవస్థాన కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

18న తిరుపతిలో ధన్వంతరి మహర్షి జయంతి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): వైద్యానికి ఆది గురువు అయిన ధన్వంతరి మహర్షి జయంతి వేడుకలను ఈనెల 18న తిరుపతిలో నిర్వహించనున్నట్లు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. గోపి శ్రీనివాస్ తెలిపారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. ధన్వంతరి మహర్షి జయంతి వేడుకలకు ధన్వంతరి మహర్షి వారసులైన నాయీ బ్రాహ్మణులతో జరిపేందుకు ఓబీసీ మోర్చా నిర్వహించిందన్నారు. అందుకు తిరుపతి జిల్లా పరిసర ప్రాంతాల్లోని నాయీ బ్రాహ్మణులందరిని ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నామన్నారు. జిల్లాలోని నాయీ బ్రాహ్మణులందరికీ ఈ సమావేశానికి ఆహ్వానం పలుకుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎస్ వంశీధర్‌రెడ్డి, బీజేపీ నాయకులు, నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

విరాళం అందజేత



ఆర్‌అండ్‌బీ ఎస్ఈ చేతుల మీదుగా విరాళం చెక్కును బాలికకు అందచేస్తున్న నాయకులు

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో ప్రింటింగ్ టెక్నీషియన్‌గా పనిచేస్తూ కరోనా సమయంలో కరోనాతో చనిపోయిన డీ. నాగమణి కుమార్తెకు రాష్ట్ర ఆర్‌అండ్‌బీ ఉద్యోగులు ఒక రోజు జీతం రూ.లక్ష చెక్కును అందచేశారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ ఎస్ఈ జీ.రామకృష్ణప్రసాద్ సమక్షంలో చెక్కును ఆ బాలికకు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.కుమార్, , ఏపీ ఆర్‌అండ్‌బీ అసోసియేషన్ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ వనరులపై శిక్షణ

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లోని ఆదాయ వనరులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రమణారెడ్డి అ న్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో పంచాయ తీ సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఏవో చం ద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ వెంకటాద్రి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా అందుబాటులో ఉంచండి

ఆత్మకూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజ న్‌లో రైతులకు అవసరమైన యూరియాను అందుబాటు లో ఉంచేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధి, ప్రజల సమ స్యల పరిష్కారమే లక్ష్యంగా అందరం కలిసి పనిచేయా లన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా వరికి అవసర మైన ఎరువులను అందుబాటులోకి తేవాలని సూచించారు. ప్రస్తుతం గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సర ఫరాపై ప్రత్యేక దృష్టి సారించి సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్‌పై అవగాహన

ఆత్మకూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ బాలికల వసతి గృహం ప్రాంగణంలో మంగళవారం జీఎస్టీ సంస్కరణలపై బీసీ హాస్టల్ సంక్షేమ అధికారులు(హెచ్‌డబ్ల్యువో)లకు ఆత్మకూరు ఏబీసీడబ్ల్యువో కృష్ణయ్య ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాళెం బీసీ సహాయ సంక్షేమ అధికారులు కృష్ణయ్య, వెంకటేష్ మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాలకు జీఎస్టీ ఫలాలు అందించడంలో అవగాహన కల్పించారు. ప్రస్తుతం అమలులో ఉన్న జీఎస్టీ 2.0లోని వివిధ అంశాలను, నాలుగు స్లాబ్ విధానాలపై వివరించారు. 99 శాతం వస్తువులు, సేవలు పన్ను రహితంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు, బుచ్చి డివిజన్ పరిధిలోని హాస్టల్ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

మోటారు బైక్ మాయం

సంగం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): సంగం బస్టాండ్‌లో డాకా వెంకట ప్రసాద్ మోటారు బైక్ మంగళవారం మాయమైంది. గ్రామానికి చెందిన వెంకటప్రసాద్ ఉదయం సుమారు 10 గంటల సమయంలో తన ఏపీ 26ఏ ఎక్స్ 2612 నెంబరు గల హీరో స్ప్లెండర్ మోటారు బైక్‌ను బస్టాండ్ సెంటర్ వెనుక వైపు రాగి చెట్టు వద్ద తాళం చేసి నెల్లూరు వెళ్లాడు. తిరిగి సాయంత్రం 3.30 గంటలకు వచ్చి మోటారు బైక్ వద్దకు వెళ్లగా బైక్ లేదు. దీంతో ఎవరో గుర్తుతెలియని వ్యక్తి మోటారు బైక్‌ను చోరీ చేసి ఉంటారని భావించి సంగం పోలీసులకు ఫిర్యాదు చేశారు.



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

ఆడబిడ్డలను కాపాడుకోవటం అందరి బాధ్యత

● అంతర్జాతీయ బాలికా దినోత్సవ ర్యాలీలో కలెక్టర్ శుక్లా

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : భవిష్యత్ తరాల మనుగడ కోసం ఆడబిడ్డలను కాపాడుకోవటం మనందరి బాధ్యత అని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నెల్లూరులోని డీకే మహిళా కళాశాల నుంచి జీజీహెచ్ వరకు బాలికలతో స్కూటర్ ర్యాలీ జరిగింది. దీనిని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఆడపిల్ల ఇంటికి వెలుగని, ఆమె అనుకుంటే ఏమైనా సాధించగలదని, కుటుంబం కోసం ఆమె చేసే త్యాగం మరెవ్వరూ చేయలేరంటూ మహిళల ఔన్నత్యాన్ని, ప్రతిభా పాటవాలను కొనియాడారు. ప్రతీ ఇంట్లో ఆడబిడ్డ చదువుకుంటే ఆ కుటుంబంతోపాటు సమాజం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ప్రజలకు ఆడబిడ్డల గొప్పతనం తెలిసేలా జిల్లాలో వారం రోజులు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, బాలల సంరక్షణ అధికారి సురేష్, ఆర్‌ఐవో వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



స్కూటర్ ర్యాలీలో మహిళలు, బాలికలు

ఆడపిల్లల పుట్టుక అవసరం : డీఎంహెచ్‌వో

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఆడపిల్లల పుట్టుక ఈ సమాజానికి ఎంతో అవసరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వీ సుజాత పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆడపిల్లలను రక్షిద్దాం కార్యక్రమంలో భాగంగా మంగళవారం నగరంలో ర్యాలీ జరిగింది. ఈకార్యక్రమాన్ని ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ ఆడపిల్లని పుట్టనిద్దామని, ఎదగనిద్దామని వారిని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుదామని పిలుపునిచ్చారు. లింగ వివక్షను పూర్తిగా నివారిద్దామన్నారు. అన్ని రంగాల్లో బాలికలే ముందున్నారని దీన్ని ప్రతి తల్లిదండ్రులు గుర్తించి వారిని బాగా చదివించాలని కోరారు. రైతు బజారులోని పట్టణ ఆరోగ్య కేంద్రం నుంచి నవాబుపేట, స్టోన్‌హౌస్‌పేట మీదుగా ర్యాలీ సాగింది. ఈకార్యక్రమంలో డీఎల్‌ఏటీవో షేక్ ఖాదర్‌వలి, డీఐవో ఉమామహేశ్వరి, డీపీఎంవో రమేష్, డీఎం హెచ్ హుస్సేనమ్మ, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి మిస్బా సుల్తానా, డిప్యూటీ డీఎంహెచ్‌వో వెంకటేష్, హెల్త్ సూపర్‌వైజర్ కరుణమ్మ, కమ్యూనిటీ ఆర్గనైజర్ వేణు, ఏఎన్ఎంలు, వైద్య ఆరోగ్య సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికా దినోత్సవ అవగాహన ర్యాలీ

ఉదయగిరి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది మంగళవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మంగళవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. సీహెచ్‌వో శివకుమారి, హెచ్‌ఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆడపిల్లలు చదుకున్నప్పుడే ఇల్లు, సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ఆడపిల్లలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారన్నారు. బాల్య వివాహాలను నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు చెన్నయ్య, బోగ్యం వెంకటేశ్వర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలి : ఏపీటీఎఫ్

నెల్లూరు(విద్య), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ బదిలీల చట్టం ప్రకారం జిల్లాలో బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే ఆయా పాఠశాల లకు పంపించాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో వారు వినతిపత్రం ఇచ్చారు. ఈ ఏడాది జూన్‌లో జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా జిల్లాలో 384 మంది ఉపాధ్యాయులు నూతన ప్రాంతాలకు బదిలీపై వెళ్లి చేరినా బలవంతంగా గతంలో విధులు నిర్వహించిన పాఠశాలలకే తిరిగి వచ్చేలా చేశారన్నారు. దీనిపై పలుమార్లు అధికారులతో మాట్లాడినా ఫలితం లేకపోవడంతో ఉపాధ్యాయులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారన్నారు. ఎంటీఎస్ ఉపాధ్యాయులు వందమందికి పైగా పాఠశాలల్లో చేరినప్పటికీ కొంతమందిని మాత్రమే రిలీవ్ చేసి మిగిలిన వారిని అదే పాఠశాలల్లో కొనసాగిస్తున్నారని ఆరోపించారు. అధికారుల అసంబద్ధ నిర్ణయాల కారణంగానే ఈ పరిస్థితి ఉత్పన్నమైందని విమర్శించారు. అలాగే డీఎస్సీ ద్వారా కొత్తగా చేరిన ఉపాధ్యాయులకు కూడా ఖాళీలను చూపకుండా వారికి అవసరమైన పాఠశాలలనే చూపించి నియామకాలు చేపట్టారన్నారు. విద్యాశాఖ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్న కార్యక్రమాలను నిరసిస్తూ ఈనెల 17వతేదీన జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట 48 గంటల నిరాహార దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఎన్ దశరథరాములు, సీహెచ్ హజరత్ తదితరులు పాల్గొన్నారు.

19న క్రికెట్ జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఉన్న క్రికెట్ ప్రాంగణంలో ఈ నెల 19వతేదీ అండర్-14 జిల్లా బాలుర జట్టు ఎంపిక నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు ఎస్ రాజశేఖర్‌రెడ్డి, కే శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 2011 సెప్టెంబరు 1 తర్వాత తరువాత జన్మించి ఉండాలన్నారు. అర్హత కలిగిన క్రీడాకారులు సొంత క్రికెట్ కిట్, వైట్ డ్రస్, ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 7 గంటలకు హాజరు కావాలన్నారు.

సూపర్ జీఎస్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● జీఎస్టీ కావలి అసిస్టెంట్ కమిషనర్

కావలి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రజల్లో కొనుగోలు శక్తిని పెంపొందించేందుకు నష్టాలను సైతం భరిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువచ్చిన సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ 2.0 కార్యక్రమంపై విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజల్లోకి తీసుకెళ్లాలని జీఎస్టీ కావలి అసిస్టెంట్ కమిషనర్ వరప్రసాద్‌రావు తెలిపారు. ఐరన్ అండ్ హార్డ్‌వేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కావలి పట్టణంలో ఐరన్ అండ్ సిమెంట్ వ్యాపారులతో జీఎస్టీ అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ నూతన జీఎస్టీ తక్షణం అమలు పరచాల్సిన బాధ్యత వ్యాపారులపై ఉందన్నారు. తగ్గిన జీఎస్టీని అమలు చేయని వ్యాపారులపై వినియోగదారులు ఫిర్యాదు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ కమిటీ సభ్యులు, కేంద్ర, రాష్ట్ర జీఎస్టీ మెంబర్ అమరా వెంకటసుబ్బారావు మాట్లాడుతూ కొత్త జీఎస్టీ వలన రాష్ట్రానికి రూ.8వేల కోట్లు నష్టం వస్తున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలలో కొనుగోలు శక్తి పెంచేందుకు జీఎస్టీ 2.0 ను అమలులోకి తీసుకు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ నెల్లూరు డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ వై. యానాది, కావలి డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ వై.వీ జ్యోతి, శ్రీశైలం దేవస్థానం కమిటీ సభ్యురాలు సుబ్బలక్ష్మీ, బీ. వీరాస్వామి, రాజేంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ వరప్రసాద్‌రావు

శుభ్రతతో ఆరోగ్యం !

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ఆరోగ్యానికి ఎంతో ముఖ్యం. శారీరక పరిశుభ్రత... ప్రధానంగా చేతుల పరిశుభ్రత పాటించకపోవడం వల్లే ఎంతో మంది వ్యాధుల బారిన పడుతున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. పిల్లలు మట్టిలో ఆడుకుని ఆ తర్వాత చేతులు సరిగా శుభ్రం చేసుకోకుండా ఆహారం తీసుకోవడం వల్ల అనారోగ్యం పాలవుతున్నారు. పెద్దలు కూడా వివిధ కారణాలు, అవగాహన లోపంతో శుభ్రతలేక రోగగ్రస్తులవుతున్నారు. ఇలాంటి వారికి ఒక్కోసారి హెపటైటిస్ వంటి ప్రాణాంతక వ్యాధులు కూడా వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో చిన్నతనం నుంచే చేతుల పరిశుభ్రతపై సరైన అవగాహన కల్పించాలని వైద్యులు సూచిస్తున్నారు. ఆహారం తినే ముందు, మల విసర్జన తర్వాత తప్పనిసరిగా చేతులు శుభ్రంగా కడుక్కోవడం ఎంతో ముఖ్యమని హెచ్చరిస్తున్నారు.

● చేతుల పరిశుభ్రతలేక అనేక వ్యాధులు
● వీటి ప్రాధాన్యతపై నిర్లక్ష్యం వీడాలి
● 60 శాతం వ్యాధులు వీటి వల్లే
● ప్రాణాంతక వ్యాధులూ వచ్చే అవకాశం
● చిన్నారుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి

నేడు గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే



నెల్లూరు (వైద్యం), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : అపరిశుభ్రమైన చేతితో ఆహారం తినడం వల్ల ఆ చేతులలో ఉన్న బ్యాక్టీరియా, బ్యాక్టీరియా గుడ్లు కడుపులోకి వెళ్లి వ్యాధులు కలుగజేస్తాయి. జిల్లాలో ప్రస్తుతం నమోదవుతున్న రోగాలలో 60 శాతం చేతులు అపరిశుభ్రత వల్లే వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. టైఫాయిడ్, అతిసారా, కలరా, జంక విరేచనాలతోపాటు శ్వాసకోశ వ్యాధులు కూడా ప్రబలుతున్నాయని, ప్రత్యేకించి స్వైన్‌ఫ్లూ వంటి ప్రాణాంతక వ్యాధి ఇలాంటి నిర్లక్ష్యం వల్ల కూడా వ్యాపిస్తున్నట్లు పేర్కొంటున్నారు. ఈ పరిస్థితిలో చేతుల పరిశుభ్రతపై అత్యంత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది.

ప్రచారం ఏది?

చేతుల పరిశుభ్రతపై ప్రభుత్వ పరంగా ప్రజలను చైతన్య వంతులను చేయాల్సిన అవసరం ఉంది. అయితే ఆదిశగా చర్యలు మాత్రం తీసుకోవటం లేదు. ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, ఐసీడీఎస్‌లు సంయుక్తంగా చేతుల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సి ఉంది. కానీ తగిన ప్రచారం కల్పించడంలో వైఫల్యం చెందుతున్నారన్న విమర్శలున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలలోకూడా చిన్నారులు, గర్భవతులకు చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించకపోవడంతో ఎంతో మంది రక్తహీనతకు గురవుతున్నారు. స్వచ్ఛభారత్ - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో పరిసరాలతోపాటు చేతుల పరిశుభ్రతపై కూడా ఉవ్వెత్తున చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉంది.

చేతుల పరిశుభ్రతలేకే అనేక వ్యాధులు

చేతుల పరిశుభ్రత లేకపోవటం వల్లే అనేక వ్యాధులు వస్తున్నాయి. చేతులారా అనారోగ్యాన్ని కోరి తెచ్చుకుంటున్నాము. దినచర్యలో భాగంగా చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. ఆహారం తినే ముందు తప్పనిసరిగా చేతులను సబ్బుతో కడగాలి. తద్వారా క్రిములు కడుపులోకి పోకుండా ఆపొచ్చు. ఆసుపత్రికి వచ్చే రోగులలో చాలా మంది చేతుల అపరిశుభ్రత వల్లే వ్యాధులకు గురవుతున్నట్లు తెలుస్తోంది. అంటురోగాలకు కూడా అపరిశుభ్రతే కారణమవుతోంది. చేతుల పరిశుభ్రతపై విస్తృత ప్రచారం అవసరం.



\- డాక్టర్ అమరేంద్రనాథ్ రెడ్డి, ప్రభుత్వ వైద్యుడు

నేర నియంత్రణకు నాకాబందీ

● ఎస్పీ అజిత వెల్లడి ● అర్ధరాత్రి నగరంలో పరిశీలన



నెల్లూరులోని వారధి సెంటర్‌లో నాకాబందీని పరిశీలిస్తున్న ఎస్పీ అజిత

నెల్లూరు(క్రైం), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణలో భాగంగా నాకా బందీ నిర్వహిస్తున్నామని ఎస్పీ అజిత వేజెండ్ల తెలిపారు. రాత్రిపూట వాహనాల తనఖీలు తీవ్రతరం చేసి రౌడీయిజం, దౌర్జన్యాలు, దోపిడీ, దొంగతనాల నిర్మూలించడం, రోడ్డు ప్రమాదాల నివారణ, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. నెల్లూరు నగరంలో జరుగుతున్న నాకాబందీని సోమవారం అర్ధరాత్రి ఆమె పరిశీలించారు. ఇరుకళల పరమేశ్వరి దేవస్థానం, నాలుగు కాళ్ళ మండపం, నెల్లూరు బ్యారేజ్, మెడికవర్ వైద్యశాల, బుజబుజ నెల్లూరు, అయ్యప్పగుడి సెంటర్, కరెంట్ ఆఫీస్, ఆర్టీసీ బస్టాండు, వీఆర్సీ తదితర ప్రాంతాల్లో పరిశీలన జరిపారు. అనంతరం నైట్ బీట్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి బీట్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సోమవారం అర్ధరాత్రి 1580 వాహనాలు తనిఖీ చేయగా ఓపెన్ డ్రింకింగ్ 52 కేసులు, డ్రంకన్ డ్రైవ్ 17 కేసులు నమోదు చేసి మూడు వాహనాలు సీజ్ చేశామని, ఎంవీ యాక్ట్ కేసులు 179 నమోదు చేసి రూ.58,795 అపరాధ రుసుము విధించినట్లు చెప్పారు.

నిమ్మ సాగులో అనవసర ఖర్చులు తగ్గించుకోవాలి

● ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడ్డి

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నిమ్మ సాగులో అనవసరపు ఖర్చులు తగ్గించుకోవాలని, శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ అధిక ఆదాయం పొందాలని జిల్లా ఉద్యానశాఖాధికారి సుబ్బారెడ్డి నిమ్మ రైతులకు సూచించారు. నెల్లూరు వ్యవసాయ పరిశోధన క్షేత్రంలో మంగళవారం ఉద్యాన రైతులకు నిమ్మ పంటపై జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. పెరియవరం కేవీకే శాస్త్రవేత్త డీ తిరుపాల్ మాట్లాడుతూ నిమ్మలో పూతను నియంత్రించుకుని అధిక ధరలు ఉన్న సమయంలో పంటను తీసుకునేందుకు జూన్, సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో శాస్త్రవేత్తల సూచనల మేరకు జెబ్బరిల్లిక్ ఆమ్లం, సూకోసిల్, పొటాషియం నైట్రేట్‌ను నీటితో కలిపి పిచికారీ చేయాలని వివరించారు. వేరుకుళ్ళు నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను నిమ్మ పరిశోధప స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం కవిత తెలియజేశారు. కోత అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలను అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కే వెంకట సతీష్, నిమ్మతోటలో అంతర పంటల సాగుపై ఆత్మకూరు ఉద్యానశాఖ ఏడీ అనూరాధ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సదస్సులో మార్కెటింగ్ ఏడీ అనిత, పలువురు అధికారులు, శాస్త్రవేత్తలు, ఉద్యాన రైతులు, ఉద్యాన విస్తరణ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడ్డి



కమిషనర్ చాంబరులో చర్చిస్తున్న మున్సిపల్‌శాఖ ఉన్నతాధికారులు

ఈ - వేలంలో ఐడీఎస్‌ఎంటీ ప్లాట్లు

● మున్సిపల్ ఉన్నతాధికారుల నిర్ణయం

కావలి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలో 30 ఏళ్ల కిందట పురపాలక సంఘం వేసిన లేఅవుట్‌లోని ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ స్మాల్ అండ్ మైనర్ టౌన్ (ఐడీఎస్ఎంటీ) ప్లాట్లలో మిగిలిపోయిన ప్లాట్లను ఈ వేలం ద్వారా విక్రయించాలని మున్సిపల్ ఉన్నతాధికారులతో కూడిన ఐడీఎస్ఎంటీ కమిటీ తీర్మానించింది. కావలి మున్సిపల్ కమిషనర్ చాంబరులో మంగళవారం గుంటూరు రేంజ్ మున్సిపల్ పరిపాలనశాఖ రీజనల్ డైరెక్టర్ హరికృష్ణ, టౌన్ ప్లానింగ్ రీజనల్ డైరెక్టర్ మధుకుమార్, ప్రజా ఆరోగ్యశాఖ నెల్లూరు సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, కావలి మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్‌లు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఆదాయం పెంపొందించుకునేందుకు మిగిలి ఉన్న ఐడీఎస్ఎంటీ ప్లాట్లు ఎంత ధరకు ఎలా విక్రయించాలనే దానిపై చర్చించారు. ఐడీఎస్ఎంటీ ప్లాట్లలో ప్రస్తుతం 11 అంకణాల ప్లాట్లు 72, 37 అంకణాల ప్లాటు1, 35 అంకణాల ప్లాట్లు 6 ఎవరికి కేటాయించకుండా మున్సిపాల్టీ ఆధీనంలో ఉన్నాయి. వాటిని వేలం వేస్తే ప్లాట్ల ధరలు పెరుగుతాయని నిర్ణయించారు. స్థానికంగా వేలం వేస్తే కొన్ని సమస్యలు వస్తాయని ఈ వేలం ద్వారా విక్రయించి మున్సిపల్ ఆదాయం పెంపొందించుకోవాలని నిర్ణయించారు. ఆ నిధులతో ఐడీఎస్ఎంటీ ప్లాట్లలో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వారు తెలిపారు.

బైపాస్ రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేస్తాం

ఆత్మకూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలోని వెంకట్రావుపల్లి సమీపంలో హనుమాన్ జంక్షన్ వద్ద నుంచి ఆత్మకూరు పట్టణంలోకి రూ. 6.31 కోట్లతో చేపట్టిన బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేస్తామని ప్రచాయతీ రాజ్ ప్రాజెక్టు ఇప్లిమెంటేషన్ విభాగం (పీఆర్‌పీఐయు) ఎస్ఈ కోటేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన ఆత్మకూరులో జరుగుతున్న బైపాస్ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బైపాస్ రోడ్డు 2.5 కి.మీ పొడవు, 9 మీటర్లు వెడల్పుతో నాలుగు వరుసల రహదారిగా 18 మీటర్లు వెడల్పుతో విస్తరిస్తామని తెలిపారు. సెంటర్ డివైడర్, లైటింగ్, వాకింగ్ ట్రాక్‌కు మార్జిన్ ఉండేలా నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌పీఐయు ఈఈ సత్యనారాయణరెడ్డి, డీఈ సుధాకరయ్య, ఏఈ మవేక్‌రెడ్డి పాల్గొన్నారు.



బైపాస్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న అధికారులు

కడనూతలలో జాతీయ మానవహక్కుల కమిషన్ బృందం

బిట్రగుంట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ కడనూతలలో మంగళవారం జాతీయ మానవ హక్కుల కమిషన్ బృందం పర్యటించింది. ఇక్కడ గ్రామస్థులు, ఆర్ఎస్ఆర్ కళాశాల యాజమాన్యం మధ్య ఏర్పడిన మురుగునీటి పారుదల సమస్యపై జాతీయ మానవహక్కుల కమిషన్ బృందంలో అధికారులు కుల్బీర్‌సింగ్, యతిప్రకాశ్‌శర్మ, సంజయ్ కుమార్‌లు క్షేత్రస్థాయిలో పరిశీలించి విచారించారు. కళాశాల కరస్పాండెంట్ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కళాశాల్లో వినియోగించిన వ్యర్థనీటి పారుదలకు అడ్డంకులు కల్పిస్తున్నారని ఫిర్యాదు చేయగా, విద్యార్థులు వినియోగించిన వ్యర్థనీరు, మలమూత్రాలను బయటకు విడుదల చేయడం వలన పంట కాలువలో కలిసి దుర్వాసన వెదజల్లడమే కాకుండా పొల్లాలోకి దిగాలంటే ఇబ్బందిగా మారిందని గ్రామస్థులు, రైతులు ఫిర్యాదు చేశారు. కళాశాల ప్రహరీకి తూర్పున ఉన్న కడనూ తల దళితవాడకు చెందిన శ్మశానవాటికలోకి కళాశాల మురికినీరు చేరడం వలన పెద్దల పండుగ రోజు పూజ చేసుకునేందుకు అవస్థలు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆప్రాంతంలో ప్రతాప్‌కుమార్ రెడ్డి స్వార్థంతో మట్టి తోలడం వలన సమాధులు భూగర్భంలో కలిసి పోయాయని వివరించారు. ఈ సమస్యపై రెవెన్యూ, ఇరిగేషన్, గ్రామపంచాయతీ మండల సర్వే అధికారులతో వారు మాట్లాడారు. కళాశాల నిర్వాహకుల సమస్యలు, గ్రామస్థుల విన్నపాలను జాతీయ మానవహక్కుల కమిషన్ బృందం వేర్వేరుగా అడిగి తెలుసుకున్నారు. గ్రామస్థులతో సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి మీడియాను నిరాకరించడంతోపాటు పరిశీలన వివరాలను వెల్లడించేందుకు వారు నిరాకరించారు. ఈ కార్యక్రమంలో మండల డిప్యూటీ తహసీల్దారు భరత్, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, రూరల్ సీఐ పాపారావు, బోగోలు దగదర్తి ఎస్ఐలు ప్రభాకర్, జంపాని కుమార్, సర్వేయరు వెంకటేశ్వర్లు, వీఆర్వో శివ, కార్యదర్శి రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.



మానవ హక్కుల కమిషన్ బృందానికి సమస్యను వివరిస్తున్న గ్రామస్థులు



పాడిరైతులకు మందుల సంచులు అందజేస్తున్న జేడీ రమేష్‌నాయక్, తదితరులు

పశువుల్లో గర్భకోశవ్యాధుల నివారణకు చర్యలు

● పశుసంవర్ధకశాఖ జేడీ రమేష్‌నాయక్

కొండాపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పశువులలో గర్భకోశ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని పశుసంవర్ధకశాఖ జేడీ రమేష్‌నాయక్ అన్నారు. పశుగణాభివృద్ధిశాఖ, పశుసంవర్ధకశాఖలు సంయుక్తంగా మండలంలోని తూర్పుఎర్రబల్లిలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత గర్భకోశవ్యాధుల చికిత్స శిబిరంలో ఆయన పాల్గొన్నారు. పశువులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందచేశారు. గర్భకోశ వ్యాధులు సోకకుండా వైద్యులు సూచించిన సలహాలు పాటించాలని జేడీ తెలిపారు. పాడి రైతులకు ప్రభుత్వం 75 శాతం రాయితీతో పశుగ్రాసాన్ని అందచేస్తుందన్నారు. రానున్న వర్షాకాలంలో పశువులకు, గొర్రెలకు వ్యాధులు సోకకుండా ముందస్తుగానే టీకాలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఉపసంచాలకులు జీ.శ్రీధర్‌రావు, ఈవోఎల్‌డీఏ శ్రీనివాసరావు, ఏడీ సురేష్‌బాబు, సర్పంచు ఏసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మేము లోకల్.. నీ అంతు తేలుస్తాం..!

● ఆర్టీసీ కండక్టర్‌పై అద్దె బస్సు డ్రైవర్, మెకానిక్ దాడి
● అధికారులకు ఫిర్యాదు చేశాడన్న కక్షతోనే..

కావలిరూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మేము లోకల్.. నీ అంతు తేలుస్తాం.. అంటూ ఆర్టీసీ బస్సు కండక్టర్ నార్నె వెంకయ్యపై ప్రైవేటు హయ్యర్ బస్సు డ్రైవర్ శ్రీకాంత్, గ్యారేజీలో మెకానిక్‌గా పనిచేస్తున్న రాఘవ అలియాస్ దాసు దాడి చేసిన సంఘటన మంగళవారం రాత్రి కావలి ఆర్టీసీ డిపోలో జరిగింది. బాధితుడు, స్థానికుల వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా ఒంగోలు ప్రాంతానికి చెందిన వెంకయ్య కావలి ఆర్టీసీ డిపో నుంచి దామవరం వయా నెల్లూరు బస్సు కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో మధ్యాహ్నం డ్యూటీ దిగిన వెంకయ్య నెల్లూరులోని ఆర్టీసీ అధికారులను కలిసేందుకు ఈడీ కార్యాలయానికి వెళ్లి సాయంత్రం తిరిగి కావలికి వచ్చాడు. రాత్రి బస్సు కోసం వేచి ఉండగా వెంకయ్య వద్దకు మద్యం మత్తులో వచ్చిన డ్రైవర్ శ్రీకాంత్, మెకానిక్ రాఘవలు విచక్షణా రహితంగా అసభ్య పదజాలంతో దూషిస్తూ కాళ్లు చేతులతో ప్రైవేటు పార్టులపై దాడి చేశారు. మేము లోకల్.. నీ అంతు తేలుస్తాం.. అంటూ అక్కడ నుంచి వెళ్లిపోయారు. అక్కడ ఉన్న ఆర్టీసీ సిబ్బంది కండక్టర్ వెంకయ్యను చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. కాగా 6 నెలల క్రితం ఇద్దరు ఒకే బస్‌లో ఒక్కరోజు డ్యూటీ చెయ్యగా స్టేజీల వద్ద ప్రయాణికులను దించేందుకు బస్ ఆపమని కండెక్టర్ చెప్పినా ఎక్కడో దూరంగా ఆపేవాడని డ్రైవర్ శ్రీకాంత్‌పై కండక్టర్ వెంకయ్య ఫిర్యాదు చేశాడు. దాన్ని దృష్టిలో పెట్టుకుని దాడి చేశాడని, అంతకు మించి అతనెవరో కూడా నాకు తెలియదని కండక్టర్ వాపోతూ 1వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



కండక్టర్‌ను కింద పడేసి కాలితో దాడి చేస్తున్న అద్దె బస్సు డ్రైవర్, మెకానిక్

నకిలీ మద్యం నిర్మూలించాలి

ఆత్మకూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నకిలీ మద్యాన్ని, బెల్టుషాపులను నిర్మూలించి ప్రజల ప్రాణాలను కాపాడాలని మంగళవారం స్థానిక ప్రొహిబిషన్, ఎక్సైజ్ కార్యాలయం ఎదుట వైసీపీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు వైసీపీ నేతలు మాట్లాడుతూ గ్రామ గ్రామాన మద్యం దుకాణాలు, విచ్చలవిడిగా బెల్టుషాపులుతో మద్యం ఏరులై పారుతుందన్నారు. అనంతరం ఎక్సైజ్ సీఐ ఆర్ వెంకటరమణమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, పట్టణ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్ రెడ్డి, బూత్ కమిటీల జిల్లా అధ్యక్షుడు బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి కొండా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సుకు తప్పిన ప్రమాదం

మనుబోలు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఓ స్కూల్ బస్సు డ్రైవర్ పూటుగా మద్యం సేవించి బస్సు నడపి పిల్లలను ఆందోళనకు గురిచేసిన సంఘటన మంగళవారం మండలంలోని కొలనుకుదురులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు... స్థానిక దళితవాడ నుంచి సుమారు 36మంది పిల్లలు గూడూరులోని ఓ ఇంగ్లీషు మీడియం పాఠశాలకు వెళతారు. బస్సు డ్రైవర్ మద్యం సేవించి గూడూరు నుంచి బస్సు నడిపాడు. చివరికి గ్రామంలోని శివాలయం పక్కన ఉన్న కాలువలోకి తీసుకెళ్లడంతో చిన్నారులు హడలిపోయారు. దీంతో తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యాన్ని ప్రశ్నించారు. డ్రైవర్‌ను పాఠశాల నిర్వాహకులు మందలించారు. పిల్లలు సురక్షితంగా ఉండడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

వైద్యుల సమ్మెకు సిబ్బంది సంఘీభావం

ఉదయగిరి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లు పరిష్కరించాలని వైద్యులు చేస్తున్న సమ్మెకు స్థానిక పాత సామాజిక ఆరోగ్య కేంద్రం ఎదుట మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి వైద్యఆరోగ్య సిబ్బంది సంఘీభావం తెలిపారు. వైద్యుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించి రోగులకు మెరుగైన వైద్యసేవలందేలా చర్యలు చేపట్టాలన్నారు.

యూరియా పంపిణీపై అవగాహన

చేజర్ల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి). ఇటీవల యూరియా పంపిణీలో రైతులు ఇబ్బందులు పడిన నేపథ్యంలో రాబోయే సీజన్‌లో అటువంటి తప్పులు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వ్యవసాయశాఖ ఏడీఏ శివనాయక్ తెలిపారు. మంగళవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో రైతు సేవా సిబ్బందికి, ఎరువుల దుకాణదారుల డీలర్లకు, రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయశాఖ అధికారి హిమబిందు, వ్యవసాయశాఖ సిబ్బంది, ఎరువుల దుకాణదారుల డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

పక్కాగృహాల నిర్మాణాల పరిశీలన

ఉదయగిరి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాయపాళెం పంచాయతీ గంగిరెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్‌లో పక్కాగృహాల నిర్మాణాలను మంగళవారం హౌసింగ్ ఇన్‌చార్జి డీఈ షేక్ పీరాన్, ఇన్‌చార్జి ఏఈ షరీఫ్, ఉపాధి హామీ ఏపీవో ఆజాంఖాన్ పరిశీలించారు. లబ్ధిదారుల్లో ఉపాధి నిధులు దక్కని వారిని గుర్తించి, 90 రోజుల పనిదినాలు కల్పించి త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 12,098
వెండి కిలో ధర	రూ. 1,81,800
వెండి ఒక గ్రాము	రూ. 190.80

రేపు మండల కో ఆర్డినేటర్ల సమావేశం

సంగం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక జీబీకేఆర్ జడ్పీ పాఠశాలలో గురువారం ఉదయం 10 గంటలకు ఆత్మకూరు డివిజన్‌లోని అన్ని మండలాల కోఆర్డినేటర్ల సమావేశం జరుగుతుందని డివిజన్ కోఆర్డినేటర్ మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి వచ్చే మండలాల కోఆర్డినేటర్లు మండలస్థాయిలో జరిగిన ఎస్‌జీఎఫ్ (స్కూల్ గ్రేమ్స్ ఫెడరేషన్) టోర్నమెంట్ ఎంపిక జాబితాను తీసుకురావాలని తెలిపారు. సందేహాలుంటే 9494640181ను సంప్రదించాలని కోరారు.

నిబంధనలు పాటించాలి

సంగం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): లైసెన్సు కలిగిన బాణాసంచా దుకాణదారులు దుకాణాల ఏర్పాటు, బాణాసంచా విక్రయాల్లో ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సీఐ వేమారెడ్డి హెచ్చరించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఆయన లైసెన్సు కలిగిన బాణాసంచా దుకాణదారులతో సమావేశం నిర్వహించి నియమ నిబంధనలను వివరించారు. ఇళ్లలో బాణాసంచా నిల్వ చేయడం, ఇళ్ల మధ్య విక్రయించడం చేస్తే కఠిన చర్యలు, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సంగం మండల పరిధిలోని ముంబై జాతీయ రహదారిపై అధిక వేగంగా వెళ్లే వాహనాల వల్ల తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, దానిని నియంత్రించేందుకు స్పీడ్‌గన్ ఏర్పాటు చేశామన్నారు. దీని ద్వారా అధిక వేగంతో వెళ్లే వాహనదారులను గుర్తించి రూ.2వేల వరకు జరిమానా విధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగం, ఏఎస్‌పేట, చేజర్ల ఎస్‌ఐలు, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

అతిక్రమిస్తే చర్యలు

కలువాయి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసే టపాసుల దుకాణదారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ ఎస్ కోటయ్య హెచ్చరించారు. దుకాణాలను జనావాసాల మధ్య కాకుండా వారికి కేటాయించిన స్థలంలోనే ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడైనా లైసెన్స్ లేకుండా బాణాసంచా నిల్వ చేసినా, విక్రయించినా వారి కేసులు నమోదు చేస్తామని తెలిపారు. లైసెన్స్ లేకుండా టపాసులు విక్రయిస్తుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

అనుమతులు తప్పనిసరి

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బాణాసంచా దుకాణాదారులు తప్పనిసరిగా అనుమతులు పొందాలని ఎస్‌ఐ రఘునాథ్ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధలను ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. రద్దీ ప్రాంతాల్లో కాకుండా బహిరంగ ప్రదేశాల్లో దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఆత్మకూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పేకాట స్థావరంపై మంగళవారం పోలీసులు దాడి చేశారు. ఆరుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.41,500, ఐదు సెల్‌ఫోన్‌లు, నాలుగు మోటారుబైకులను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ జీ.గంగాధర్ తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తామని ఆయన పేర్కొన్నారు.

ఆర్థిక వనరులు పెంచుకోవాలి

పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ

ఉదయగిరిలో హాజరుకాని సర్పంచులు

సీతారామపురం , అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధికి సొంత ఆదాయ వనరులు సమకూర్చుకోవాలనే అంశంపై పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులకు ప్రభుత్వం శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. పలు మండలాల్లో మంగళవారం ఈ కార్యక్రమాలు జరిగాయి. సీతారామపురంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో చంద్రశేఖర్ అధ్యక్షతన సొంత ఆదాయ వనరులపై శిక్షణ ఇచ్చారు. స్థానిక సంస్థల ఆర్థిక స్థిరత్వాన్ని పెంపొందించేందుకు స్వీయ ఆదాయ వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం అవసరమని అధికారులు పేర్కొన్నారు. ఆస్తి పన్ను, మార్కెట్ ఫీజులు, భవన అనుమతులు, నీటి వినియోగ చార్జీలు వంటి అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రామ్‌నాథ రెడ్డి, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సంగంలో...

సంగం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్‌పై పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఎంపీడీవో షాలెట్ ప్రారంభించారు. పంచాయతీలను బలోపేతం చేయడానికి, స్థానిక స్వపరిపాలన మెరుగు పరచడానికి వనరులను సద్వినియోగం చేసుకుని సంపద (ఆదాయం) సృష్టించే అంశాలపై వివరించారు. అనంతరం జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన ఇద్దరు కార్యదర్శులు టీ. మల్లికార్జున, రాజులు పంచాయతీకి ఆర్థిక బలోపేతానిచ్చే పన్నులు, ఫీజులు, అద్దెలు వంటి వనరుల ద్వారా సొంత ఆదాయాన్ని ఎలా పెంపొందించుకోవాలనే అంశంపై వివరించారు. మండలంలోని 20 మంది సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కలువాయిలో..

కలువాయి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలు సొంతంగా ఆదాయం పెంచుకునే మార్గాలపై సర్పంచులు, కార్యదర్శులకు మంగళవారం అధికారులు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇంటి పన్నులు సక్రమంగా వసూలు చేయడంతో పాటు ఇతర ఆదాయ వనరులను ఏర్పాటు చేసుకోవాలని ఎంపీడీవో శైలజ సూచించారు. డిప్యూటీ ఎంపీడీవో రమేష్ పాల్గొన్నారు.

అనంతసాగరంలో..

అనంతసాగరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరు చేసే నిధులతో గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపించాలని ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అభివృద్ధి కార్యాచరణ వివరాలు తెలియజేశారు. ఈవోపీఆర్డీ రామచంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.



సర్పంచులు హాజరు కాకపోవడంతో ఖాళీ కుర్చీలు

ఉదయగిరి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్త్రీశక్తి భవనంలో పంచాయతీల అభివృద్ధికి సొంత ఆర్థిక వనరులను పెంపొందించుకోవడం ఎలా అనే అంశంపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. అయితే మండలంలో 17 పంచాయతీలు ఉండగా ఒక సర్పంచ్, ఇద్దరు బినామీ సర్పంచులు మాత్రమే హాజరయ్యారు. పంచాయతీ కార్యదర్శులు అందరూ హాజరయ్యారు. శిక్షణకు సర్పంచులే రాకపోతే ఎలా? అని పలువురు విమర్శిస్తున్నారు. ఎంపీడీవో బీ శ్రీనివాసులు, ఏవో పద్మజ తొలుత గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి శిక్షణ ప్రారంభించారు.

దుత్తలూరులో...

స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమా వేశ మందిరంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీవో చెంచమ్మ ప్రారంభించారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై అవగాహన

ఆత్మకూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ బాలికల వసతి గృహం ప్రాంగణంలో మంగళవారం జీఎస్టీ సంస్కరణలపై బీసీ హాస్టల్ సంక్షేమ అధికారులు(హెచ్‌డబ్ల్యువో)లకు ఆత్మకూరు ఏబీసీడబ్ల్యువో కృష్ణయ్య ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాళెం బీసీ సహాయ సంక్షేమ అధికారులు కృష్ణయ్య, వెంకటేష్ మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాలకు జీఎస్టీ ఫలాలు అందించడంలో అవగాహన కల్పించారు. ప్రస్తుతం అమలులో ఉన్న జీఎస్టీ 2.0లోని వివిధ అంశాలను, నాలుగు స్లాబ్ విధానాలపై వివరించారు. 99 శాతం వస్తువులు, సేవలు పన్ను రహితంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు, బుచ్చి డివిజన్ పరిధిలోని హాస్టల్ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన కల్పించండి

ఉదయగిరి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని 17 పంచాయతీల్లో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు ఇంటింటా తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

మోటారు బైక్ మాయం

సంగం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): సంగం బస్టాండ్‌లో డాకా వెంకట ప్రసాద్ అనే యువకుడి మోటారు బైక్ మంగళవారం పట్టపగలు మాయమైంది. వివరాల మేరకు.. సంగం గ్రామానికి చెందిన వెంకట ప్రసాద్ ఉదయం సుమారు 10 గంటల సమయంలో తన ఏపీ 26ఏఎక్స్ 2612 నెంబరు గల హీరో స్ప్లెండర్ మోటారు బైక్‌ను సంగం బస్టాండ్ సెంటర్ వెనుక వైపు రాగి చెట్టు వద్ద తాళం చేసి నెల్లూరు వెళ్లాడు. తిరిగి సాయంత్రం 3.30 గంటలకు వచ్చి మోటారు బైక్ వద్దకు వెళ్లగా బైక్ లేదు. దీంతో ఎవరో గుర్తుతెలియని వ్యక్తి మోటారు బైక్‌ను చోరీ చేసి ఉంటారని భావించి సంగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు సంగం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ నాయకుడి మృతికి సంతాపం

ఉలవపాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కరేడుకు చెందిన టీడీపీ నాయకుడు, పాఠశాల కమిటీ మాజీ చైర్మన్ మద్దెల శ్రీనివాసులు సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. పలువురు టీడీపీ నాయకులు ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. గ్రామాధ్యక్షుడు నేలటూరి ఆదాము, క్లస్టర్ ఇన్‌చార్జ్ పోలుబోయిన శ్రీనివాసులు, సుంకర చెంచురామిరెడ్డి, మంచిరాజు రాంబాబు, గడ్డం నవీన్, శ్రీహరి, గోపాల్ పాల్గొన్నారు.

ఆదాయ వనరులపై శిక్షణ

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లోని ఆదాయ వనరులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రమణారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఏవో చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ వెంకటాద్రి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా అందుబాటులో ఉంచండి : ఎంపీపీ

ఆత్మకూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్‌లో రైతులకు అవసరమైన యూరియాను అందుబాటులో ఉంచేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అందరం కలిసి పనిచేయాలన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా వరికి అవసరమైన ఎరువులను అందుబాటులోకి తేవాలని సూచించారు. ప్రస్తుతం గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించి సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో గ్రామపంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. పంచాయతీల అభివృద్ధి, స్థానిక అవసరాలు, నిధుల లభ్యత మేరకు ప్రణాళికలు రూపొందించాలని కోరారు. ముందుగా వ్యవసాయశాఖ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, గృహనిర్మాణశాఖ తదితర శాఖలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పెమ్మసాని లక్ష్మీప్రసున్న, ఎంపీడీవో పీ.రఫీ ఖాన్, డిప్యూటీ ఎంపీడీవో పీ.భువనేశ్వరి, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగమాంబపురం ఎస్సీ కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త మెడబలిమి వెంకటగిరి అనారోగ్యంతో మృతి చెందాడు. మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు, నాయకులు మంగళవారం వెంకటగిరి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబీకులను పరామర్శించి, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మండల మాజీ కన్వీనర్ చంద్ర వెంకయ్య, సొసైటీ డైరక్టర్ మానం కొండలరావు రూ.5 వేలు చొప్పున నగదు అందజేశారు.

కల్తీ మద్యం తయారీకి బీజం వేసింది వైసీపీయే...

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన

ఉదయగిరి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కల్తీ మద్యం తయారీకి బీజం వేసింది గత వైసీపీ ప్రభుత్వమేనని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబు యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయగిరి పట్టణంలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులతో కలిసి వ్యాపారస్తులు, ప్రజలకు అవగాహన కల్పించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ నాయకుల తీరు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందన్నారు. వారి ప్రభుత్వంలో విచ్చలవిడిగా కల్తీ మద్యం విక్రయాలు చేపట్టి వేల మంది పేదల ప్రాణాలను పొట్టనపెట్టుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు నరసింహా, ఓబులరెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

రైలు ఢీకొని ఉపాధ్యాయిని మృతి



పద్మావతి (ఫైల్)

నెల్లూరు(క్రైం), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రైలు గేటు వేసుంది... అంతా వాహనాలను గేటు ముందు నిలిపి ఉన్నారు....అయితే ఓ మహిళ మాత్రం గేటు వేసున్నా ముందుకు అడుగులు వేసింది...అమ్మా రైలు వస్తుంది.. ఆగండి అంటూ... అంతా కేకలు వేస్తున్నా నిలిచి ఉన్న గూడ్స్ రైలును చూస్తూ ఆ పక్కన వస్తున్న మరో రైలును చూడకుండా ముందుకు అడుగులు వేసి ప్రమాదవశాత్తు రైలు కింద పడి ఓ ఉపాధ్యాయురాలు మంగళవారం సాయంత్రం మృతి చెందారు. రైల్వే పోలీసుల కథనం మేరకు, నగరంలోని త్యాగరాజునగర్‌లో రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ రామాంజనేయులు, పద్మావతి(50) దంపతులు. వారికి ఇద్దరు కుమార్తెలు. వారికి వివాహాలు అయ్యి వేరే ప్రాంతాల్లో ఉన్నారు. పద్మావతి మనుబోలు మండలం కొలనుకుదురు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఎప్పటిలానే మంగళవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన పద్మావతి పాఠశాల ముగిసిన తర్వాత సాయంత్రం నెల్లూరుకు చేరుకున్నారు. వేదాయపాలెం రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న రైల్వే గేటు గుండ ఇంటికి వెళుతుండగా గేటు మూసి ఉంది. ఈ సమయంలో గేటు దాటి ముందుకు సాగిన పద్మావతి ఓ గూడ్సు రైలు ఆగి ఉండటం చూసి అడుగులు ముందుకు వేసింది. అదే సమయంలో మరో రైలు వేగంగా వచ్చి పట్టాలు దాటుతున్న ఉపాధ్యాయురాలిని వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో పద్మావతి అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్‌ఐ హరిచందన సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం అందుకున్న పద్మావతి కుటుంబసభ్యులు మార్చురీకు చేరుకొని కన్నీరుమున్నీరయ్యారు.

గుర్తుతెలియని వ్యక్తి ...

నెల్లూరు(క్రైం) అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నగరంలోని వేదాయపాలెం- నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్ల మధ్య కొండాయపాలెం గేటు సమీపంలో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసుల కథనం మేరకు, గుర్తుతెలియని వ్యక్తి(50) కొండాయపాలెం సమీపంలో ఉద్దేశ్యపూర్వకంగా నెల్లూరు మెమో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న స్థానికులు రైల్వే సిబ్బందికి తెలియ చేశారు. రైల్వే ఎస్‌ఐ ఎన్ హరిచందన సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు తెలుపు రంగు ఫుల్ హ్యాండ్స్ షర్ట్, బులుగురంగు చెక్స్ లుంగీ ధరించి ఉన్నాడు.

బైకుల ఢీ.. ముగ్గురికి తీవ్ర గాయాలు

దుత్తలూరు(ఉదయగిరి), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ గ్రామ సమీపాన రిలయన్స్ పెట్రోలు బంకు వద్ద 565 జాతీయ రహదారిపై మంగళవారం రెండు మోటారు బైకులు ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా గుంటపల్లికి చెందిన నవీన్, డానియేల్, రాజులు పని నిమిత్తం దుత్తలూరు వైపు వస్తుండగా వరికుంటపాడు మండలం తిమ్మారెడ్డిపల్లికి చెందిన అబ్దుల్ బాషా కావలి నుంచి స్వగ్రామానికి వెళుతున్నాడు. ఈ తరుణంలో రిలయన్స్ పెట్రోల్‌బంకు వద్ద రహదారికి మరమ్మతులు జరుగుతుండగా ప్రమాదవశాత్తు రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అబ్దుల్‌బాషా, నవీన్, డానియేల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని హైవే అంబులెన్స్‌లో స్థానిక పీహెచ్‌సీకి తరలించారు.

భారీగా గంజాయి పట్టివేత

● రెండు ఆర్టీసీ బస్సుల్లో 23 కిలోల స్వాధీనం



పట్టుబడిన నిందితులు, పక్కనే గంజాయి ప్యాకెట్లు

వెంకటాచలం, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలం సమీపంలోని టోల్ ప్లాజా వద్ద మంగళవారం ఉదయం ప్రొహిబిషన్, ఎక్సైజ్ (ఎన్ఫోర్స్మెంట్) నెల్లూరు - 2 ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భం గా ఏపీ40జెడ్0758 ఆర్టీసీ బస్సులో తనిఖీలు చేయగా వెస్ట్ బెంగాల్ రాష్ట్రం ముషీరాబాద్ జిల్లాకు చెందిన ప్రశాంత మండల్, రఫీకుల్ ఇస్లాం, బాపన్ సెఖ్ అనే ముగ్గురు నిందితులు 18 కిలోల గంజాయిని తరలిస్తున్నట్లు గుర్తించారు. ఎక్సైజ్ పోలీసులు తమదైన శైలిలో విచారించగా కేరళ రాష్ట్రంలోని పెరుంబపూర్‌కు చెందిన షోమ్మి అనే వ్యక్తికి ఇచ్చేందుకు ఒరిస్సా నుంచి తీసుకుని వస్తున్నట్లు తెలిపారు. భద్రాక్‌లో ఒక వ్యక్తి ఒక్కొక్కరికి రూ.3 వేలు చొప్పున తమకు కూలి ఇస్తామని చెప్పడంతోనే తాము గంజాయిని రవాణా చేస్తున్నట్లు నిందితులు పేర్కొన్నారు. అలాగే ఏపీ39యుజెడ్5544 ఆర్టీసీ బస్సును కూడా నిలిపి తనిఖీలు చేయగా ఆ బస్సులో కర్ణాటక రాష్ట్రంలోని హాసన్ జిల్లాకు చెందిన అప్పాజీ గౌడ్ అనే వ్యక్తి విశాఖపట్నంలో దినేష్ అనే వ్యక్తి నుంచి కేజీ రూ. 6 వేలు చొప్పున 5 కిలోల గంజాయిని కొనుగోలు చేసి తన సొంత గ్రామంలో అధిక ధరకు విక్రయించేందుకు తీసుకుని వెళ్తుండగా ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఎక్సైజ్ పోలీసులు చేపట్టిన వేరువేరు తనిఖీల్లో రెండు ఆర్టీసీ బస్సుల్లో 23 కేజీల గంజాయిని తరలిస్తున్న నలుగురు నిందితులను ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారినుండి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను నెల్లూరు - 2 ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ దాడుల్లో సీఐలు పీ అనిత, పీ ప్రసన్నలక్ష్మి, సయ్యద్ కాలేషావలి, ఎస్‌ఐ పూర్ణకుమార్, హెచ్‌సీలు ఎన్ ప్రసాద్, ఎం కిరణ్ సింగ్, పీసీలు ఎస్ మునిరాజ్‌కుమార్, టీ సుబ్రహ్మణ్యం, డీ గిరిబాబు, వై మురళీమోహన్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి పాడిగేదె మృతి

బిట్రగుంట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం ముంగమూరుకు చెందిన రైతు మారుబోయిన మాల్యాద్రికి చెందిన పాడి గేదె మంగళవారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. బాధితుడి వివరాల మేరకు.. ఆయన తెల్లగుంట గ్రామంలోని తాగేటి చెరువు వద్ద పశువులను మేతకు తోలుకెళ్లాడు. పొర్లుకట్టపై ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి రొయ్యల గుంటకు వేసిన విద్యుత్ తీగలు రెండు అడుగుల ఎత్తులో ఉండటంతో ఆ తీగలు తగిలి గేదె మృతి చెందింది. దీనిని పదిహేను రోజుల క్రితమే రూ. 1.10 లక్షలతో కొనుగోలు చేసినట్లు బాధితుడు తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేస్తునట్లు మాల్యాద్రి తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

● 9 మంది అరెస్టు

కావలి రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం ముసునూరు సమీపంలో మంగళవారం పేకాట స్థావరంపై రూరల్ పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో సీఐ రాజేశ్వరరావు ఆదేశాల మేరకు ఎస్‌ఐ బాజీబాబు తన సిబ్బందితో కలసి నిర్వహించిన ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.18,400 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా పేకాట, కోడిపందేలు, గంజాయి వంటి మత్తు పదార్థాలు అమ్ముతున్నట్లైతే సమాచారమివ్వాలని సీఐ తెలిపారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బ్రాయిలర్ లైవ్	122
స్కిన్ చికెన్	222
స్కిన్‌లెస్	244


కోడిగుడ్ల ధర (100): 525

గూగుల్ క్లౌడ్ సంస్థ రాష్ట్రానికి ఓ మైలు రాయి : ఎమ్మెల్యే

కావలి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): విశాఖకు గూగుల్ క్లౌడ్ సంస్థ రాక రాష్ట్రసర్వతో ముఖాభివృద్ధికి ఓ మైలు రాయిగా నిలుస్తోందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ మంత్రి నారా లోకేష్‌లు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ఏడాదిగా మంత్రి లోకేష్ చేసిన కృషి ఫలితంగా రూ.1.33 లక్షల కోట్ల పెట్టుబడులతో పాటు 2లక్షల ఉద్యోగాలను సృష్టించే గూగుల్ క్లౌడ్ సంస్థను రాష్ట్రానికి తీసుకు రావటం చారిత్రాత్మక విషయమన్నారు. దేశంలోనే తొలి సారి 15 బిలియన్ డాలర్ల ఎఫ్‌ఐ పెట్టు బడులను సాధించటం ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణమన్నారు. గూగుల్ క్లౌడ్ సంస్థ ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థతోపాటు వ్యవసాయం, వైద్యం, విద్య రంగాలు బలోపేతం అవుతాయన్నారు.

హెచ్‌ఐవీపై విద్యార్థులకు అవగాహన అవసరం

ఉలవపాడు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పాఠశాలస్థాయి నుంచి ప్రతివిద్యార్థి హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని కరేడు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు సూచించారు. మంగళవారం కరేడు జడ్పీ హైస్కూల్లో రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నివారణ ఆదేశాల మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, ఏఎన్ఎంలు శ్రీలక్ష్మి, పద్మావతి పాల్గొన్నారు.



తహసీల్దారును దుర్భాషలాడిన యువకుడు

లింగసముద్రం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు మద్యం మత్తులో తహసీల్దారు కార్యాలయంలో విధినిర్వహణలో ఉన్న తహసీల్దారు కే.కోటేశ్వరరావును దుర్భాషలాడాడు. ఈ ఘటన సోమవారం సాయంత్రం జరగగా తహసీల్దారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ యువకుడిని పోలీసులు అదేరోజు రాత్రి అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో ఆ యువకుడి తల్లిదండ్రులు, బంధువులు, పలువురు నేతలు మంగళవారం తహసీల్దారు కార్యాలయం వద్దకు చేరుకొని తహసీల్దారు కోటేశ్వరరావుతో చర్చించి మద్యం మత్తులో తప్పు చేశాడని, అందుకు ఆ యువకుడితో క్షమాపణ చెప్పించడంతో రాజీ కుదిరింది.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

కందుకూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని ఆర్టీవో టీవీఎస్ లక్ష్మి హెచ్చరించారు. మంగళవారం స్థానిక ప్రాంతీయ రవాణా అధికారి కార్యాలయంలో ఆటోడ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎంవీఐ జంగాల అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆదేశాలతో కాలువల్లో పూడికతీత

కావలిరూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆనెమడుగు పంచాయతీ మసీదు కాలనీలో ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆదేశాలతో మంగళవారం కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టారు. ఈ కాలనీలో ఏళ్లతరబడి మురుగు నీటి కాలువలు పూడిక, చెత్తతో నిండిపోయి దుర్గంధం వెదజల్లుతుండటంతో పాటు వర్షం పడినప్పుడు రామిశెట్టి గుంట నుంచి మన్నంగిదిన్నె చెరువుకు వెళ్లవలసిన వర్షపునీరు కాలనీలోని ఇళ్లలోకి చేరింది. దీంతో విషజ్వరాల బారిన పడుతున్నట్లు ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు నన్నేసాహెబ్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే ఆయన స్పందించి కాలువల్లో పూడికతీత, చెత్త తొలగింపు పనులు చేయించారు. నేతలు గుడిపల్లి వెంకట్రావ్, కోణంకి రమణయ్య, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురెడ్డి పర్యవేక్షించారు.

వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన

బిట్రగుంట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేట జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు అక్షయ మహిళా యువజన సంఘం అధ్యక్షురాలు జీశైలజ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా సెట్నల్ కార్యనిర్వాహణాధికారి ఏ.నాగేశ్వరరావు, నెహ్రూయువకేంద్ర యూత్ అధికారి ఏ.మహేంద్రరెడ్డి పాల్గొన్నారు. ఈనెల 23వ తేదీన నెల్లూరు డీకేడబ్ల్యూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు జరుపుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం జీ.గంగాధర్‌రావు, ఉపాధ్యాయులు శివపార్వతి, వెంకటేశ్వర్లు, టీ.శ్రీనివాసరావు, ఎండీ.గయాస్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతపై చర్యలు తీసుకోవాలి

కందుకూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కందుకూరు వైసీపీ కార్యాలయంలో ఇటీవల ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్‌యాదవ్ సమక్షంలోనే మాజీ కౌన్సిలర్ రేణమాల అయ్యన్నపై కులం పేరుతో దూషించి దాడిచేసిన మల్లెబోయిన రామారావుపై కేసు నమోదుచేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌పీఎస్ ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షుడు రావినూతల కోటి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంఆర్‌పీఎస్ నాయకులు మంగళవారం పట్టణ ఎస్ఐ శివనాగరాజుకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు ఉసురుపాటి బ్రహ్మయ్య, అత్యాల శరత్, గౌడపేరు కృష్ణ, రేణమాల మాధవ్, గౌడపేరు మహేష్, రావినూతల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అంకమ్మ ఆలయ ప్రాంగణంలో చెట్లను కాపాడాలి

కందుకూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయ ప్రాంగణంలో ఉన్న శతాబ్దాల నాటి వృక్షాలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని పిన్నంరాజు ప్రభాకరరావు, తానికొండ వెంకటేశ్వర్లు, పీఆర్‌కే మురళి, తల్లపనేని నరసింగరావు, సురేష్, సతీష్‌కుమార్ సబ్ కలెక్టరుకు విజ్ఞప్తి చేశారు. ఆలయ ప్రాంగణంలో 120 ఏళ్లకు పైబడిన వేపచెట్లు, చింతచెట్లు ఉన్నాయని, వాటిలో కొన్నింటిని ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా తొలగించారని, వాణిజ్య సముదాయం అభివృద్ధి కోసం మిగిలిన చెట్లను కూడా తొలగించే ప్రయత్నం జరుగుతుందని పేర్కొన్నారు. ఆ వృక్షాలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం అందజేసినట్లు వారు తెలియజేశారు.

స్వదేశీ ఉత్పత్తులనే ఉపయోగించాలి

కందుకూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): విదేశీ వస్తువులకు ప్రత్యామ్నాయంగా స్వదేశీ ఉత్పత్తులను ఉపయోగించటం ద్వారా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వయం సంవృద్ధి - భారత్ అభియాన్ కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అవకాశం ఉందని బీజేపీ జిల్లా నాయకుడు చుండి హరగోపాలరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు మన్నేపల్లి వరప్రసాదరావు, గట్టమనేని హరిబాబు, జొన్నాదుల రాఘవయ్య, ముప్పల భూషయ్య, పాలూరి మాల కొండారెడ్డి, నవులూరి రాజేష్, తుమ్మపూడి శివమహేశ్వరరావు, జగన్నాథం వైకుంఠం పాల్గొన్నారు.

● **బీజేపీ నేతల ప్రతిజ్ఞ**

కావలి(టౌన్): ఆత్మ నిర్భర్ కార్యశాల (స్వయం సమృద్ధి భారత్) కార్యక్రమంలో భాగంగా మంగళవారం బీజేపీ ఒకటవ పట్టణ కార్యాలయంలో స్వదేశీ వస్తువులే వినియోగిద్దామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మంద కిరణ్, నేతలు గుండ్లపల్లి భరత్‌కుమార్, కంచర్ల మురళీకృష్ణనాయుడు, బెల్లకొండ మాల్యాద్రి, కుట్టుబోయిన బ్రహ్మానందం, పరుసు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వీఆర్ఏల మహాధర్నాను జయప్రదం చేయండి

కందుకూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 15వ తేదీన విజయవాడలో నిర్వహించ తలపెట్టిన మహా ధర్నాను జయప్రదం చేయాలని వీఆర్ఏల సంఘం డివిజన్ నాయకుడు, సీఐటీయూ అధ్యక్షుడు జీ.రమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కందుకూరు డివిజన్‌లోని వీఆర్ఏలంతా భారీగా తరలిరావాలని ఆయన ఆ ప్రకటనలో పిలుపునిచ్చారు.











లిక్కర్ స్కామ్ కేసులో సిట్.. శ్రీవారి పరకామణి కేసుపై సీఐడీ అధికారులు ఒకే రోజు తిరుపతిలో తమ కార్యకలాపాలు చేపట్టారు. రెండు కీలక కేసులపై.. రెండు విభాగాల అధికారుల తనిఖీలు, ఫైళ్ల సీజ్‌తో కలకలం రేగింది.

సిట్.. కలకలం సీఐడీ

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



పెద్దిరెడ్డి నివాసం నుంచి బయటకు వస్తున్న సిట్ అధికారులు

● మద్యం స్కాంపై పెద్దిరెడ్డి ఇంట్లో తనిఖీలు

వైసీపీ హయాంలో నాసిరకం మద్యం.. అధిక ధరలకు అమ్మడంపై కూటమి ప్రభుత్వం 'సిట్'ను ఏర్పాటు చేసి విచారణ చేపట్టింది. ఈ లిక్కర్ కేసులో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని ప్రధాన నిందితుడిగా పేర్కొన్నారు ఈయన బెయిల్‌పై బయటకు వచ్చారు. ఇదే కేసులో చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి జైలులో ఉండగా.. ఆయన కుమారుడు మోహిత్‌రెడ్డినీ మరో నిందితుడిగా సిట్ అధికారులు చేర్చారు. ఇటీవల పుత్తూరులోని నివాసంలో మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామిని సిట్ అధికారులు విచారించారు. తాజాగా మంగళవారం హైదరాబాదు, బెంగళూరుతో పాటు తిరుపతి నగరం మారుతీనగర్‌లోని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇంట్లో సిట్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో మిథున్‌రెడ్డి లేరని.. ఆయన తండ్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాత్రం ఉన్నారని తెలిసింది. పెద్దిరెడ్డి కుటుంబానికి చెందిన పీఎల్ఆర్ నిర్మాణ సంస్థ ఖాతాలకు లిక్కర్ స్కామ్‌కు సంబంధించిన నిధులు మళ్లించారనే ఆరోపణల నేపథ్యంలో.. ఆ సంస్థకు డైరెక్టర్‌గా ఉన్న పెద్దిరెడ్డి సతీమణి స్వర్ణలతను సిట్ అధికారులు ప్రశ్నించారు. ఆ నిధులు ఎక్కడివి? ఎలా వచ్చాయనేది రాబట్టినట్లు తెలిసింది. పెద్దిరెడ్డి ఇంట్లో ఉన్న పీఎల్ఆర్ నిర్మాణ సంస్థ ఉద్యోగుల నుంచీ స్టేట్‌మెంట్లు తీసుకున్నట్టు తెలిసింది. కీలకమైన ఏడు డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. ఇలా సిట్ అధికారులు విచారణ నిమిత్తం రావడంతో వైసీపీలో కలకలం రేగింది.

● పరకామణి కేసులో ఫైళ్ల సీజ్

వైసీపీ ప్రభుత్వంలో 2023 ఏప్రిల్ 29న తిరుమల శ్రీవారి ఆలయ పరామణిలో డాలర్లు చోరీ చేస్తూ జియ్యంగార్ మఠం ఉద్యోగి రవికుమార్ పట్టుబడగా.. ఈ కేసును నిబంధనలకు విరుద్ధంగా లోక్ అదాలత్‌లో రాజీ చేసుకున్నారు. దీనిపై హైకోర్టులో ప్రజాప్రయోజనాల వ్యాజ్యం దాఖలు కావడంతో విచారించిన హైకోర్టు పరకామణి కేసులో ఏమి జరిగిందో దర్యాప్తు చేసి ఆధారాల సహా నివేదికను సీల్డ్ కవర్‌లో ఈనెల 17న అందజేయాలని ఆదేశించింది. ఈ క్రమంలో సీఐడీ డైరెక్టర్ జనరల్ రవిశంకర్ అయ్యనార్ సోమవారం రాత్రే తిరుపతి చేరుకున్నారు. సీఐడీ లీగల్ అడ్వైజర్ లక్ష్మణరావు, తిరుపతి సీఐడీ అధికారులతో కలసి మంగళవారం ఉదయాన్నే తిరుమలలో దర్యాప్తు, ఆధారాల సేకరణ ముగించుకుని తిరిగి తిరుపతి వచ్చారు. తిరుపతిలో సెకండ్ ఏడీఎం కోర్టు న్యాయాధికారిని కలిశారు. ఈ కేసుకు సంబంధించిన ఫైళ్లు, రికార్డులు కావాలని కోరుతూ మెమో దాఖలు చేశారు. కేసు రాజీకి సంబంధించి లోక్ అదాలత్ రికార్డులూ కావాలని అభ్యర్థించారు. అనంతరం టీటీడీ ఏడీ భవనానికి చేరుకుని ఈవో అనిల్ కుమార్ సింఘాల్‌తో సమావేశమయ్యారు. 'పరకామణి' కేసుకు సంబంధించి రికార్డులు, చోరీ సమయంలో పనిచేసిన సిబ్బంది వివరాలు, ఇప్పుడు ఎక్కడున్నారనే వివరాలు కావాలని కోరారు. అప్పటి సీసీ కెమెరాల ఫుటేజీ ఇవ్వాలన్నారు. ఇలా ఏడీ భవనంలోనే 5.20 గంటలపాటు ఉన్నారు. తిరుపతి, తిరుమలలో సీజ్ చేసిన రికార్డులను బుధవారం హైకోర్టుకు సమర్పిస్తామని మీడియాకు చెప్పారు. ఇలా 'పరకామణి' కేసుపై సోమవారం హైకోర్టు సీరియస్ కావడం.. మంగళవారమే సీఐడీ అధికారులు వచ్చి రికార్డులు సీజ్ చేయడం.. బుధవారం హైకోర్టుకు సమర్పించనుండటం వంటి పరిణామాలు వేగంగా జరగడంతో సంబంధితుల్లో కలవరం మొదలైంది.



తిరుపతిలో న్యాయస్థానం నుంచి వస్తున్న సీఐడీ డీజీ రవిశంకర్ తదితరులు

◆ సీఐడీ అధికారులు

తిరుమలలో 7 గంటలు

తిరుమల, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి పరకామణి చోరీ కేసుకు సంబంధించి సీఐడీ అధికారుల బృందం దాదాపు ఏడు గంటల పాటు మంగళవారం తిరుమలలో పర్యటించింది. సోమవారం రాత్రి తిరుమలలోని పోలీస్ గెస్ట్‌హౌస్‌కు సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యనార్, సీఐడీ లీగల్ అడ్వైజర్ లక్ష్మణ్ రావు చేరుకున్నారు. స్థానిక సీఐడీ, పోలీసు, విజిలెన్స్ అధికారులతో మంగళవారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు డీజీ సమీక్షించారు. ఎస్పీ సుబ్బరాయుడు, సీఐడీ డీఎస్పీలు వేణుగోపాల్, కొండయ్య, విజిలెన్స్ వీఎస్వో రామ్‌కుమార్, డీఎస్పీ విజయ్‌శేఖర్‌తో కలిసి పరకామణి కేసు గురించి ఆరా తీశారు. పరకామణిలో లెక్కింపు ఎలా జరుగుతాయి, ఎవరెవరు పాల్గొంటారు, లెక్కింపుల అనంతరం జరిగే డిపాజిట్లు, తనిఖీలు, సీసీ కెమెరాల నిఘా వంటి వివిధ అంశాలపై చర్చించారు. అప్పటి ప్రత్యక్ష సాక్షులతోనూ మాట్లాడారు. తిరుమల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని గంటన్నర పాటు పరకామణి కేసు రికార్డులను పరిశీలించి సీజ్ చేశారు.



పంచె, బనియన్‌తో సీఐడీ డీజీ రవిశంకర్, లక్ష్మణరావు

పంచె, బనియన్‌లో డీజీ

మధ్యాహ్నం 12.30 గంటలకు ఆలయం వెలుపల ఉన్న నూతన పరకామణికి చేరుకున్నారు. నిబంధనల ప్రకారం డీజీ రవిశంకర్ అయ్యనార్, లీగల్ అడ్వైజర్ లక్ష్మణ్‌రావు పంచె, బనియన్ ధరించి పరకామణిలోకి ప్రవేశించారు. భద్రతా తనిఖీలను వీక్షించారు. కానుకల విభజన, లెక్కింపు, భద్రతపరచడం, తరలించే విధానాలను పరిశీలించారు. కానుకల లెక్కింపు సమయంలో తీసుకునే జాగ్రత్తలను అడిగి తెలుసుకున్నారు. 1.20 నుంచి 2 గంటల వరకు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీసీ కెమెరాల లైవ్ ఫుటేజ్‌ను పరిశీలించారు.

నేటి నుంచి స్విమ్స్ ఫ్యాకల్టీకి ఇంటర్వ్యూలు

● డెంటిస్ట్రీ పోస్టుకు బ్రేక్
● తర్వాత నోటిఫికేషన్‌లో నాన్ మెడికల్ నియామకాలు

తిరుపతి, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని స్విమ్స్‌లో ఫ్యాకల్టీ నియామక ప్రక్రియకు కసరత్తు పూర్తయింది. బుధవారం నుంచి మూడు రోజులపాటు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆదేశాల మేరకు డెంటిస్ట్రీ పోస్టుకు ఇంటర్వ్యూలు నిర్వహించడంలేదని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్ 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి చెప్పారు. వైసీపీ నేతకు అనుకూలంగా 'ఓరల్ మ్యాక్సిల్లో ఫేషియల్ సర్జరీ'గా నోటిఫికేషన్‌లో పేర్కొన్నారన్న ఆరోపణలపై 'నేను చెప్పిన అభ్యర్థికే పోస్టు దక్కాలి' శీర్షికన గత నెలలో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. అదేవిధంగా స్విమ్స్ వర్సిటీలో పీజీ, పీహెచ్‌డీ చేసిన నాన్ క్లినికల్ అభ్యర్థులను నోటిఫికేషన్‌కు దూరం పెట్టిందని 'చదువు చెప్పిన చోటే వద్దంటోంది' శీర్షికన మరో కథనం ప్రచురించింది. ఈనేపథ్యంలో స్విమ్స్, టీటీడీ పెద్దలు పునరాలోచించారు. డెంటిస్ట్రీ పోస్టును పక్కన పెట్టి తక్కిన పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించాలని నిర్ణయించారు. నోటిఫికేషన్‌లోని 104 పోస్టులకుగాను 315 దరఖాస్తులు వచ్చాయి. వీటిని పరిశీలించగా సుమారు 208 మందికి కాల్ లెటర్లు పంపారు. రోజుకు 70 మంది చొప్పున మూడు రోజులపాటు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు.

నిష్పక్షపాతంగా ఇంటర్వ్యూలు

శ్రీపద్మావతి మహిళా మెడికల్ కళాశాలకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) గుర్తింపు రద్దుకాకుండా ఉండేందుకు ఫ్యాకల్టీ నియామక ప్రక్రియను వేగవంతం చేశాం. ఫ్యాకల్టీ భర్తీ చేయకపోతే 700 మంది మెడికోల జీవితాలను అయోమయంలో పడతాయి. ఐవీ సుబ్బారావు కమిటీ, స్విమ్స్ కమిటీ, టీటీడీ ఎక్స్‌టెర్నల్ కమిటీ పర్యవేక్షణలో నిష్పక్షపాతంగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాం. ఎక్స్‌టర్నల్ నిపుణులుగా బర్డ్ డైరెక్టర్, మధురై డైరెక్టర్‌కూడా హాజరుకానున్నారు. నాన్ మెడికల్ అభ్యర్థులకు కూడా ఎలాంటి అన్యాయం జరగదు. తర్వాత నోటిఫికేషన్‌లో వారికి ప్రాధాన్యమిస్తాం.

- ఆర్వీ కుమార్, స్విమ్స్ డైరెక్టర్

'తోతాపురి' సబ్సిడీ రూ.26 కోట్ల జమ

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని తోతాపురి మామిడి రైతుల ఖాతాల్లో కిలో రూ.4 చొప్పున రూ.26 కోట్ల సబ్సిడీ నగదు జమ చేసినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం తెలిపారు. జిల్లాలో పల్ప్ పరిశ్రమలకు, ర్యాంపులకు 5,952మంది రైతులు 65,014 టన్నుల తోతాపురి రకం కాయలను విక్రయించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మంగళవారం రూ.26కోట్ల నగదు జమ చేసినట్లు కలెక్టర్ తెలిపారు..



డ్రోన్లున్నాయ్.. జాగ్రత్త

2 నెలల్లో నమోదైన కేసుల వివరాలు

జూదం కేసులు: 4
పట్టుబడిన నిందితులు: 46 మంది
సీజ్ చేసిన నగదు: రూ.4,29,740

కోడి పందేలు

నమోదైంది : ఒక కేసు
పట్టుబడిన నిందితులు : 25 మంది
సీజ్ చేసిన నగదు: రూ.61,116

ఏర్పేడు మండల పరిధిలో ఇటీవల డ్రోన్ పట్టించిన పేకాట డెన్

● పేకాట, కోడి పందేల స్థావరాలపై నిఘా
● నిరంతర తనిఖీలకు అధికారుల ప్లాన్

ఎవరినీ వదలం



గంజాయితో పాటు కోడి పందేలు, జూద నిర్వాహకులు.. ఎవరైనా వదిలిపెట్టం. కేసులు నమోదు చేస్తాం. ఇప్పటికే దీనిపై ప్రత్యేక నిఘా ఉంచాం. ఎక్కడైనా డెన్‌లు ఏర్పాటు చేసుకుని కోడి పందేలు, జూదం ఆడుతుంటే స్థానికులు 112కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలి. ఇలా సమాచారం ఇచ్చిన వారి పేర్లను రహస్యంగా ఉంచుతాం.

- సుబ్బరాయుడు, ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దీపావళి నేపథ్యంలో కోడి పందేలు, జూద స్థావరాలపై పోలీసులు డ్రోన్లతో నిఘా పెడుతున్నారు. ప్రధానంగా కోడి పందేల నిర్వాహకులపై దృష్టి సారించిన పోలీసులు ఇప్పటికే పలు ప్రాంతాల్లో డ్రోన్లు వినియోగించి జూదరుల ఆట కట్టించారు. ముఖ్యంగా ఎర్రావారిపాలెం, భాకరాపేట, శ్రీకాళహస్తి, నెరబైలు, తొట్టంబేడు, సత్యవేడు తదితర ప్రాంతాల్లో నిఘా పెంచి పలువురిపై కేసులు నమోదు చేశారు. ఇలా గుర్తించిన స్థావరాలపై ఆకస్మిక దాడులు చేస్తున్నారు. వారం కిందట తిరుపతి నగరం యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలోని జడ్పీ పాఠశాల వెనుక బహిరంగ ప్రదేశంలో జూదం ఆడుతున్నట్లు ఎస్పీ సుబ్బరాయుడికి సమాచారం అందింది. దీంతో సైబర్ క్రైం సీఐ వినోద్‌కుమార్‌ను అప్రమత్తం చేశారు. డీఎస్పీ భక్తవత్సలం, సీఐ రామయ్య, సిబ్బంది కలసి డ్రోన్లు పంపి ఆ ప్రాంతంలో నిఘా వుంచారు. అక్కడ జూదం ఆడుతున్న 11 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.37 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. గతంలోనూ ఇలా జూద గృహాలు, కోడి పందేలను డ్రోన్ల ద్వారా గుర్తించి.. నిందితులను అరెస్టు చేశారు. సమాచారం వచ్చిన వెంటనే డ్రోన్లను పంపడం ద్వారా శిబిరాల నిర్వాహకులను గుర్తించి వారిపై కఠిన చర్యలకు ఉపక్రమిస్తున్నారు. దీపావళితో పాటు అంతకు ముందు.. తర్వాత కోడి పందేలు, జూదాలు సాగకుండా కట్టడి చేయడానికి సైబర్ క్రైం పోలీసులకు ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. దీంతో నిరంతర తనిఖీలకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. గతంలో నమోదైన కేసులు, స్థావరాలను పరిశీలించి వాటిపై ఎక్కువగా దృష్టి కేంద్రీకరించనున్నారు.

విలువైన వస్తువుల కోసం వెళ్లి..!

● ఇంట్లో మంటల్లో చిక్కుకుని యువకుడి మృతి ● అవిలాలలో విషాదం

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తల్లీ కుమారులు ఇంట్లో నిద్రిస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున ఫ్యాను నుంచి మంటలు చెలరేగాయి. దట్టమైన పొగ వ్యాపించడంతో నిద్రలేచిన ఇద్దరూ ఆందోళనతో బయటకు పరుగులు తీశారు. సురక్షితంగా వచ్చిన వీరు.. ఇంట్లోని విలువైన వస్తువులు తీసుకొచ్చేందుకు కుమారుడు మునికుమార్ లోపలకు పరుగు తీశారు. ఆ సమయంలో మంటల్లో చిక్కుకుని మృత్యువాత పడ్డారు. ఈ విషాద ఘటన తిరుపతి రూరల్ మండలం అవిలాలలో చోటు చేసుకుంది. మునికుమార్ వ్యాన్ డ్రైవర్. ఇతడి తల్లి హేమ. వీరిద్దరే ఉంటున్నారు. మంగళవారం తెల్లవారుజామున ఫ్యాను నుంచి మంటలు చెలరేగాయి. షార్ట్‌సర్క్యూట్ అయింది. ఇల్లంతా వ్యాపించిన పొగతో ఉక్కిరిబిక్కిరి అయిన వీరిద్దరూ.. సురక్షింగా బయటకు వచ్చేశారు. ఇంట్లో ఉన్న డబ్బు, బంగారు, వ్యాన్ పత్రాలను తీసుకురావడానికి మునికుమార్ లోపలకు వెళ్లారు. అప్పటికే ఇంట్లో ఉన్న బీరువాకు విద్యుత్ సరఫరా అవుతోంది. అదే సమయంలో ఈయన బీరువా తెరవగానే విద్యుదాఘాతానికి గురై.. అగ్నికీలల్లో చిక్కుకుని మృతి చెందారు. అగ్నిమాపక వాహనం వచ్చేసరికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. హేమ ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేశారు. వీరిది పేద కుటుంబం కావడంతో సర్పంచి రమణ దగ్గరుండి అంత్య క్రియలు నిర్వహించారు.



మునికుమార్ (ఫైల్ ఫొటో)



అవిలాలలో కాలిన ఇల్లు



కొండ చిలువను పట్టుకున్న అటవీ శాఖ అధికారులు

శ్రీవారిమెట్టు వద్ద కొండచిలువ

చంద్రగిరి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం శ్రీవారి మెట్టు వద్ద మంగళవారం భారీ కొండచిలువ కంట పడటంతో కలకలం రేగింది. ఉదయం 9 గంటల సమయంలో చెత్త కుప్పలో కొండచిలువ ఉండటాన్ని టీటీడీ శానిటేషన్ సిబ్బంది గుర్తించారు. వెంటనే సెక్యూరిటీ దృష్టికి తీసుకెళ్లారు. జమేదర్ చిరంజీవులు సమాచారంతో టీటీడీ ఫారెస్ట్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని కొండచిలువను పట్టుకుని, అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. దీంతో భక్తులు ఊపిరి పీల్చుకున్నారు.

నవంబరు 17నుంచి పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు

తిరుచానూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు నవంబరు 17 నుంచి 25వ తేది వరకు నిర్వహించనున్నారు. వచ్చేనెల 11న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 16న అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 17న ధ్వజారోహణం, రాత్రి చిన్న శేషవాహనం, 18న ఉదయం పెద్దశేష వాహనం, రాత్రి హంసవాహనం, 19న ముత్యపుపందిరి, సింహ, 20న కల్పవృక్ష, హనుమంత, 21న పల్లకీ ఉత్సవం, గజవాహనం, 22న సర్వభూపాల, సాయంత్రం స్వర్ణ రథం, రాత్రి గరుడ వాహన సేవ, 23న సూర్యప్రభ, చంద్రప్రభ వాహనం, 24న ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహన సేవలు, 25న ఉదయం పంచమీ తీర్థం, రాత్రి ధ్వజావరోహణంలో ఉత్సవాలు ముగియనున్నాయి.

తిరుపతిలో కోర్టు కాంప్లెక్సుకు రూ.115.12 కోట్లు

● దామినేడు వద్ద 14 ఎకరాల్లో 16 భవనాల నిర్మాణం

తిరుపతి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో కోర్టు భవనాల సముదాయం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.115.12 కోట్లు మంజూరు చేసింది. తిరుపతి రూరల్ మండలం దామినేడులో కోర్టు భవనాల సముదాయం కోసం ప్రభుత్వం ఇటీవల 14 ఎకరాలు కేటాయించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం తిరుపతి నగరం వేశాలమ్మ గుడి వీధిలోని కోర్టు కాంప్లెక్సు తక్కువ స్థలంలో ఏర్పాటైంది. అందులో పలు భవనాలు బ్రిటిష్ కాలం నాటివి కావడంతో శిథిలావస్థకు చేరాయి. వాహనాల పార్కింగ్‌కు కూడా స్థలంలేదు. దీంతో కోర్టుల నిర్వహణ ఇబ్బందికరంగా మారింది. ఈ నేపథ్యాన్ని వివరిస్తూ దామినేడులో కొత్తగా కేటాయించిన 14 ఎకరాల్లో నూతన కోర్టు సముదాయం నిర్మించాల్సి ఉంది. దీనికి అవసరమైన నిధులను కేటాయించాలని కోరుతూ హైకోర్టు రిజిస్ట్రార్ (అడ్మినిస్ట్రేషన్) ఈ ఏడాది జూలై 5, సెప్టెంబరు 11, 20 తేదీల్లో ప్రభుత్వానికి లేఖలు రాశారు. దీనికి స్పందించిన ప్రభుత్వం సీఎస్ఎస్ పథకం (న్యాయ శాఖకు మౌలిక సదుపాయాల కల్పన) కింద రూ. 115.12 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో దామినేడులో 16 భవనాలతో కూడిన కోర్టు సముదాయం నిర్మించేందుకు పరిపాలనా ఉత్తర్వులు జారీ చేసింది.

20 నుంచి వెబ్‌సైట్ ద్వారా ముక్కంటి అభిషేకం టిక్కెట్లు

శ్రీకాళహస్తి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఈనెల 20వ తేదీ నుంచి పలు అభిషేక టిక్కెట్లు భక్తులు వెబ్‌సైట్‌ద్వారా తీసుకోవాలని ఈవో బాపిరెడ్డి తెలిపారు. భక్తులకు సులభతర దర్శనం కల్పించేందుకు స్వామిఅమ్మవార్ల అభిషేకం, మృత్యుంజయస్వామి అభిషేకం, రుద్రాభిషేకం, మహాన్యాసపూర్వ అభిషేక టిక్కెట్లను సంబంధిత ఆన్‌లైన్ ద్వారా భక్తులు నమోదు చేసుకోవాలన్నారు. నమోదు చేసుకున్న భక్తుల ఆధార్‌కార్డును పరిశీలించి అభిషేకాలకు అనుమతిస్తామన్నారు. భక్తులు ఈ మార్పుకు సహకరించాలని కోరారు.



సహజ వనరుల సద్వినియోగంతో పంచాయతీల అభివృద్ధి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్

కోట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సహజ వనరులపై దృష్టి కేంద్రీకరించి గ్రామాల అభివృద్ధికి బాటలు వేసుకోవాలని ఎంపీడీవో దిలీప్ కుమార్ నాయక్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ప్రభుత్వ పథకాలపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీల పాలకులు గ్రామాల అభివృద్ధి కోసం నిధుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేదన్నారు. గ్రామాల్లో కోట్లాది రూపాయల విలువచేసే సహజ వనరులు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుంటే పంచాయతీల అభివృద్ధికి బంగారుబాటలు వేసుకోవచ్చన్నారు. అవగాహన లోపంతో కొంతమంది ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. సమావేశంలో పలువురు రిసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.

చేపల చెరువు వేలం

పెళ్లకూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బంగారంపేట చెరువులో చేపల పెంపకానికి మంగళవారం పంచాయతీ కార్యదర్శి ప్రణయ్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. ప్రమిది వెంకటేశ్వర్లు రూ. 88 వేలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, సాగునీటి సంఘం అధ్యక్షుడు ముమ్మడి బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ టిప్పర్ పట్టివేత

కోట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ వద్ద మంగళవారం జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గ్రావెల్ టిప్పర్లపై దాడులు నిర్వహించారు. మండల పరిధిలోని రాఘవాపురం, తొణుకుమాల గ్రామాల సమీపం నుంచి గ్రావెల్‌ను తరలిస్తున్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. అలాగే పలు టిప్పర్లకు జరిమానా విధించారు.

సముద్రపు నాచు పెంపకంపై శిక్షణ


సముద్రపు నాచుపై అవగాహన కల్పిస్తున్న ఎఫ్‌డీవో మహిజ

తడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సముద్రపు నాచు పెంపకంపై మత్స్యశాఖ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. మంగళవారం భీముల వారిపాళెం పడవల రేవు వద్ద జరిగిన కార్యక్రమంలో పులికాట్ ల్యాండ్ స్కేప్ ప్రాజెక్టులో భాగంగా సెర్ప్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సముద్రపు నాచు పెంపకం, వాటిపై ఉపయోగాలను మత్స్యకారులకు వివరించారు. భీములవారిపాళెం పడవల రేవుకు సముద్రపు నాచు పెంపకానికి 2 యూనిట్లు మంజూరయ్యాయని మత్స్యశాఖ ఎఫ్‌డీవో మహిజ తెలిపారు. కార్యక్రమంలో పీఎసీఎస్ డైరెక్టర్ సుధాకర్, మత్స్యకార నాయకులు ఏకాంబరం, దేశప్పన్, సాగరమిత్రలు, మత్స్యశాఖ సహాయకులు పాల్గొన్నారు.

ఘనంగా 'ముప్పాళ్ల' జన్మదిన వేడుకలు


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఏఎంసీ ఛైర్మన్ రమేష్, పక్కన టీడీపీ నాయకులు సుధాకరరెడ్డి, సుబ్రహ్మణ్యం

సూళ్లూరుపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): చెంగాళమ్మ ఆలయ మాజీ ఛైర్మన్ ముప్పాళ్ల వెంకటేశ్వర్లురెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం సూళ్లూరుపేటలో ఏఎంసీ ఛైర్మన్ ఆకుతోట రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సూళ్లూరు నాగరాజపురంలోని ఎస్టీకాలనీలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం ఆర్టీసీ బస్టాండు వద్ద అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పిట్ల సుబ్రహ్మణ్యం, కౌన్సిలర్ చెంగమ్మ, టీడీపీ నాయకులు వెంకటస్వామి, అలీభాయ్, శ్రీధర్, కట్టబోయిన వెంకటేశ్ యాదవ్ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



ఆదాయ వనరుల పెంపునకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సాయి ప్రసాద్

వాకాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల ఆదాయ వనరులను పెంచుకునేందుకు ఉన్న అన్ని మార్గాలను సద్వినియోగం చేసుకునేలా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీడీవో సాయి ప్రసాద్ అన్నారు. మంగళవారం వాకాడులోని స్త్రీశక్తి భవనంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణ తరగతులను ట్రైనర్ చిన్నయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ స్థానిక వనరులైన గుంతలు, చెరువులు, వాగులు, ఇతర నిరుపయోగ భూములు, స్థలాల ద్వారా ఆదాయం వచ్చే మార్గాలను అన్వేషించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సురేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్సీ కల్యాణ్ చక్రవర్తి



గూడూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో పర్యటనలో ఉన్న మంత్రి నారా లోకేశ్‌ను ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. విశాఖపట్నంలో ఏఐ డేటా సెంటర్‌ను స్థాపించేందుకు గూగుల్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకునేందుకు ఢిల్లీకి వచ్చిన మంత్రిని ఎమ్మెల్సీ కలిశారు.

ఎస్పీని కలిసిన పరుచూరి

వెంకటగిరి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ సుబ్బరాయుడును రాష్ట్ర బ్లైండ్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పరుచూరు పెంచల నర్సయ్య మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అంధ క్రీడాకారుల కోసం బ్లైండ్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ చేస్తున్న సేవలను ఎస్పీకి వివరించారు. ఇటీవల జాతీయ స్థాయిలో జరిగిన గోల్‌బాల్ క్రీడల్లో బ్లైండ్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంధ క్రీడాకారులు ప్రతిభను చాటారని చెప్పారు. అంధ క్రీడాకారుల్లో ఆత్మవిశ్వాసం నింపుతున్న పెంచల నర్సయ్యను ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు.



ఆర్థిక వనరులను సద్వినియోగం చేసుకోవాలి

ఓజిలి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో సమకూరిన ఆర్థిక వనరులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శులకు పంచాయతీల్లో ఆర్థిక వనరులను పెంపొందించుకోవడంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూనే అదనపు వనరులపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అరుణమ్మ, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

బాలాయపల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థినిని వేధిస్తున్న యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పాఠశాలకు వెళ్తున్న విద్యార్థినిని రోజూ వెంబడించి వేధిస్తున్నాడని, మంగళవారం కూడా వెంటబడి అసభ్యంగా ప్రవర్తించడంతో విద్యార్థిని తల్లితండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మొబైల్ ఫోన్ ఇవ్వలేదని చెయ్యి కోసుకున్న బాలుడు

పాకాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మొబైల్ ఫోన్ ఇవ్వలేదని ఓ బాలుడు చెయ్యి కోసుకున్న వైనమిది. మండల కేంద్రమైన పాకాలలోని భారతంమిట్టకు చెందిన 15 యేళ్ల బాలుడు పదవ తరగతి చదువుతున్నాడు. సోమవారం రాత్రి 10 గంటల సమయంలో మొబైల్ ఫోన్‌లో ఇన్‌స్టాగ్రామ్‌లో చాటింగ్ చేస్తుండగా తల్లి గుర్తించి మొబైల్ తీసుకుంది. దీంతో బాలుడు మనస్థాపం చెంది చాకు తీసుకొని రూమ్‌లో కెళ్లి తలుపు వేసుకొని చేయి కోసుకుని అపస్మారక స్థితికి చేరుకున్నాడు. భయాందోళనతో తల్లిదండ్రులు పోలీసులకు ఫోన్‌చేశారు. పోలీసులు చేరుకొని తలుపులు బద్దలు కొట్టి బాలుడ్ని పికొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం బాలుడు కోలుకున్నాడు. కోలుకున్న ఇతడిని ఇంటికి చేర్చారు.

ఫేక్ బెదిరింపులపై నిఘా పెట్టాలి

తిరుపతి(జీవకోన), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నగర ప్రజలతో పాటు శ్రీవారి భక్తులు, వీఐపీ ప్రముఖులకు ఫేక్ మెయిల్స్ ద్వారా బాంబు బెదిరింపులతో ఇబ్బందులకు గురిచేస్తున్న ఉన్మాదులను గుర్తించి కఠినంగా శిక్షించాలని బీజేపీ నేత నవీన్ కుమార్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తిరుపతి ప్రాముఖ్యతను ప్రధాన్యతను దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాంకేతిక పరిజ్ఞానంతో అదనపు బలగాలను మోహరించేలా ఉన్నతాధికారులుచర్యలు తీసుకోవాలన్నారు. ఫేక్ మెయిల్స్ ప్రజల్లో అలజడి కలిగిస్తోందన్నారు. నగరంలో కొన్ని వెబ్ సెంటర్లలో ఫేక్ ఐడీలతో మెయిల్ క్రియేట్ చేసి తప్పుడు సమాచారం పంపించి తొలగిస్తున్నారన్నారు. అలాంటి వారిపై ప్రత్యేకనిఘా ఉంచాలన్నారు. వెబ్‌సెంటర్ నిర్వాహకులు కూడా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని చెప్పారు.

ఆదాయ వనరులపై శిక్షణ

బాలాయపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయం సమావేశ భవనంలో మంగళవారం సర్పంచ్‌లు, కార్యదర్శులకు పంచాయతీల్లో ఆదాయ వనరులు సమకూర్చుకోవడంపై శిక్షణ ఇచ్చారు.

సీపీఆర్‌పై అవగాహన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 14 (ఆంధ్ర జ్యోతి): గుండెపోటు లేదా విద్యుత్ షాక్‌కు గురైన సమయంలో ప్రాణాపాయం నుంచీ కాపాడేందుకు సీపీఆర్‌పై పద్మావతి డిగ్రీ, జూనియర్ కాలేజీల్లో మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా యూత్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ ప్రతీత్ విద్యార్థులకు ఇందులో పాల్గొని సీపీఆర్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో పద్మావతి డిగ్రీ, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాళ్ళు నారాయణమ్మ, భువనేశ్వరి దేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల ధర్నా

తిరుపతి (ఆటోనగర్), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ బ్యాంకుల్లో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని తిరుపతి బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ సంఘం (టీబీఈసీసీ) అధ్యక్ష, కార్యదర్శులు పి.విజయ భాస్కర్, జె.ధన్వంతకుమార్ డిమాండ్ చేశారు. స్థానిక కరూర్ వైశ్యా బ్యాంక్ ఎదుట మంగళవారం నిరసన ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎస్‌బీ బ్యాంకు ఉద్యోగులకు వేతన సవరణ చేయాలన్నారు. ప్రైవేటు బ్యాంక్ పెన్షనర్లకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాని కోరారు. పనిభారం తగ్గించాలని, ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. తమిళనాడు మార్కంటైల్ బ్యాంక్ ఉద్యోగుల పదవి విరమణ వయసును 60ఏళ్లకు పెంచాలన్నారు. ధర్నాలో జనార్ధన్, యగ్నేష్ బాబు, కేశవరెడ్డి, భాస్కర్, రేష్మ, సుమలత, నిర్మలాదేవి, పవన్‌కుమార్, వెంకటలక్ష్మి, పాల్గొన్నారు.



హైదరాబాద్‌కు మించి అమరావతి అభివృద్ధి

యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు మించి ప్రభుత్వం అమరావతిని అభివృద్ధి చేస్తోందని యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్ అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ రాజధాని అమరావతిని నిర్వీర్యం చేశారన్నారు. ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హయాంలో రాష్ట్రం అభివృద్ధి వైపు దూసుకెళు తోందన్నారు. అమరావతిలో అంచెలంచెలుగా జరుగుతున్న పనులు చూస్తుంటే హైదరాబాదుకు మించి అభివృద్ధి చెందే పరిస్థితి కనిపిస్తోందన్నారు. వైజాగ్‌లో గూగుల్ సంస్థ స్థాపించడానికి మంత్రి నారా లోకేష్ నిరంతర కృషి దాగి ఉందని తెలిపారు. ఈ సంస్థ ఏర్పాటు వల్ల నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపడు తాయన్నారు. రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని చెప్పారు. నాడు జగన్ కేంద్రంలో ఎవరిని కలిసినా కేసుల కోసమే వెళ్లావారని కానీ ఇప్పుడు పరిస్థితి మారిందన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రాష్ట్ర అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని ఢిల్లీ పర్యటనలు చేస్తున్నారని తెలిపారు. తాజాగా ప్రధాని నరేంద్రమోదీని చంద్రబాబు, లోకేష్ కలిసి అభివృద్ధిపై సుదీర్ఘంగా చర్చించిన విషయాన్ని వివరించారు. రాష్ట్ర నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, తాతయ్యగుంట గంగమ్మ ఆలయ ఛైర్మన్ మహేష్ యాదవ్, టీడీపీ నాయకులు రవిశంకర్ యాదవ్, శ్రీరాములు, రామారావు, చెంగయ్య పాల్గొన్నారు.

మద్యం స్కాం దారి మళ్లించడానికే వైసీపీ కుట్రలు

నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): తమ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి వైసీపీ నాయకులు కుట్రలు చేస్తున్నారని రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం విమర్శించారు. ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ వైసీపీ చేసిన నేరాలు, దుర్మార్గాలను కూటమి ప్రభుత్వంపై నెట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారన్నారు. మాజీ మంత్రి జోగి రమేష్ తన స్నేహితుడు జనార్ధన్‌రావు చేత కల్తీ మద్యం తయారీ కేంద్రం పెట్టించి, తానే పట్టించి ఆ నిందను కూటమి ప్రభుత్వంపై నెట్టడానికి చేసిన కుట్రలన్నీ బయటకు వచ్చాయన్నారు. చేసిన తప్పులను మరొకరిపై రుద్దడమే పనిగా పెట్టుకుని వైసీపీ అసత్య ప్రచారాలు చేస్తోందన్నారు. రజక కార్పొరేషన్ డైరెక్టర్ చంద్ర, పంచాయతీ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగంశెట్టి సుబ్బరామయ్య, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మీపతి నాయుడు, అశోక్ యాదవ్, మధుసూదన్ యాదవ్, ఆముదాల తులసీదాస్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పడండి: విజయశ్రీ



కలెక్టర్ వెంకటేశ్వర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ, పార్థసారధి దంపతులు

తడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పడాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, పార్థసారధి దంపతులు కోరారు. మంగళవారం తిరుపతిలో కలెక్టర్‌ను కలిసి నియోజకవర్గ అభివృద్ధి పనులపై చర్చించారు. అలాగే ఎస్పీ సుబ్బరాయుడును కలిసి శాంతి భద్రతలపై చర్చించారు. వారివెంట నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ ఉన్నారు.

జీఎస్టీ సవరణతో తగ్గిన ధరలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు

గూడూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీని సవరించడంతో పలు వస్తువుల ధరలు తగ్గాయని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ శాతం తగ్గించడంతో నిత్యావసరాలు, మందులు, గృహనిర్మాణ వస్తువులు, ఎలక్ట్రానిక్స్ వస్తువుల ధరలు తగ్గి పేదలకు అందుబాటులోకి రావడం జరిగిందన్నారు. ప్రజలు వస్తువులు కొనుగోలు చేసే సమయంలో పాత ధరలు, కొత్త ధరలను పరిశీలించి కొనుగోలు చేయాలన్నారు. అదేవిధంగా స్థానిక ఎస్కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జీఎస్టీ తగ్గింపుపై ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాసులు, శైలజ, డాక్టర్ పీర్‌కుమార్, నారాయణరాజు పాల్గొన్నారు.

మోటారు సైకిల్ చోరీ

నాయుడుపేట టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డు సమీపంలో మోటారు సైకిల్ చోరీకి గురైనట్లు బాధితుడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. చిట్టమూరు మండలం యల్లశిరికి చెందిన విజయభాస్కర్ సోమవారం రాత్రి శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలో ఉన్న ఓ టిఫిన్ సెంటర్ వద్ద మోటారు సైకిల్ ఆపి దుకాణంలోకి వెళ్లారు. అల్పాహారం తీసుకొని వచ్చి చూసేసరికి మోటారు సైకిల్ లేకపోవడంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు పట్టణంలో తనిఖీలు చేస్తుండగా బస్టాండ్ సమీపంలో బిహార్‌కు చెందిన ఓ యువకుడు మోటారు సైకిల్‌ను తీసుకెళ్తుండగా పట్టుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గూడలితిప్పపై డ్రోన్ సర్వే



గూడలి కొండ పైకి డ్రోన్‌ను పంపుతున్న పోలీసులు

కోట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కోట మండలం గూడలి తిప్పపై (కొండ) మంగళవారం పోలీసులు డ్రోన్ సర్వే నిర్వహించారు. ఎస్ఐ పవన్ ఆధ్వర్యంలో గూడలి తిప్పపై వెలసిన పర్వతవర్ధిని సమేత భీమేశ్వర ఆలయంతో పాటు కొండ కింద ఉన్న అటవీప్రాంతం గూడలిలోని గ్రామాలపై డ్రోన్ సర్వే నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయా లేదా అనే విషయాలపై డ్రోన్ ద్వారా సర్వే నిర్వహించారు. అదేవిధంగా రాజుపాళెం సమీపంలో ఉన్న స్వర్ణముఖి నది వెంబడి ఉన్న మామిడి, కొబ్బరి తోటల్లో డ్రోన్ సర్వే నిర్వహించారు.

గౌతమ బుద్ధుడి విగ్రహం ఆవిష్కరణ



డక్కిలి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలం వెంబులూరు గ్రామంలో గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని అంబేడ్కర్ ధర్మపోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఇంగిలాల రామచంద్రయ్య మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ ధర్మపోరాట సమితి మండల అధ్యక్షుడు గుండుగోలు గోపాల్, ఇడోరా బుద్ధ విహార్‌కు చెందిన భిక్షు బంతేజీ దమ్మనంద, నాయకులు సుబ్రహ్మణ్యం, నిజమాల ప్రసాద్, రమణయ్య, జంగిటి వెంకటయ్య, ఎన్.శంకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఫిర్యాదు

వాకాడు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపాళెం సర్వే నెంబరు 737లో ప్రభుత్వ భూములను ఆక్రమించి సాగు చేసుకుంటున్నారని రెడ్డిపాళెం, బాలాజీనగర్ గ్రామస్తులు మంగళవారం తహసీల్దారు ఇక్బాల్ సయ్యద్‌కు ఫిర్యాదు చేశారు.

వీరభద్రస్వామికి పూజలు

గూడూరు అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక త్యాగరాజవీధిలోని వీరభద్రస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలను స్వీకరించారు.

ఉచిత వైద్యశిబిరం

బాలాయపల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నెల్లూరు నారాయణ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ కృష్ణకుమారి 80 రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు నీలిమారాణి, యామిని, పీఆర్వో నందకిశోర్ తదితరులు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

రేపు చెంగాళమ్మ ఆలయ హుండీ లెక్కింపు

సూళ్లూరుపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరి హుండీ ఆదాయాన్ని ఈనెల 16న గురువారం లెక్కించనున్నట్లు సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి తెలిపారు.

అందుబాటులో యూరియా

వెంకటగిరి టౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా అందుబాటులో ఉందని ఏడీఏ అనసూయ అన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల డీలర్లు, సంఘాలతో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం 205 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు తీసుకొచ్చి యూరియా పొందాలన్నారు. డీలర్లు నిర్ణీత ధరలకు మాత్రమే ఎరువులు విక్రయాలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏవోలు సుజాత, ప్రవీణ, శిరీష, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలు: కురుగొండ్ల



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన తన నివాసంలోని టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. వెంకటగిరి పట్టణానికి డయాలసిస్ కేంద్రాన్ని ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ప్రస్తుతమున్న 30 పడకల ఆస్పత్రిని వంద పడకలకు పెంచడం జరుగుతుందన్నారు. అలాగే ఆస్పత్రి ప్రాంగణంలో అసంపూర్తిగా వున్న ట్రామా కేర్ సెంటరును పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాధ నాయుడు, టీడీపీ నాయకులు అవ్వారు సత్యనారాయణ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

నాయుడుపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఎల్ఏ సాగరంలోని బాలుర ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల ప్రాంగణాన్ని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా పరిశీలించారు. ప్రిన్సిపాల్ సుబ్బారావుతో మాట్లాడుతూ గురుకులంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెడతామని చెప్పారు. వర్షాలు పడుతున్న దృష్ట్యా పట్టణంలోని మురుగు కాలువలు, విన్నమాల పంటకాలువలో దోమలు వృద్ధి చెందకుండా బైటెక్స్‌ను పిచికారి చేయించారు. నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో ఆయిల్ బాల్స్ వేశారు.

















శ్రీవారిసేవలో ప్రముఖులు

గౌతమ్ సింఘానియా - మధుర్ భండార్కర్ - సావిత్రి బాలసుబ్రహ్మణ్యం

తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. రేమాండ్స్ గ్రూప్ ఛైర్మన్, ఎండీ గౌతమ్ సింఘానియా, బాలీవుడ్ చిత్ర దర్శకుడు, నిర్మాత, రచయిత మధుర్ భండార్కర్, ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి, ఏపీ ఎన్జీవో ప్రెసిడెంట్ విద్యాసాగర్, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సతీమణి సావిత్రి బాలసుబ్రహ్మణ్యం ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

అహ్మదాబాద్ సదస్సుకు తిరుపతి మేయర్



తిరుపతి(జీవకోన), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్‌లో బుధ, గురువారాల్లో జరగనున్న మేయర్ల జాతీయ శిఖరాగ్ర సమావేశానికి తిరుపతి మేయర్ డాక్టర్ శిరీషకు ఆహ్వానం అందింది. ఈ మేరకు అహ్మదాబాద్ నగరపాలక సంస్థ ఆహ్వానం పంపారు. నేషనల్ అర్బన్ కాంక్లేవ్ అండ్ మేయోరల్ సమ్మిట్ ఫర్ షేపింగ్ ఫ్యూచర్ ఆఫ్ సిటీస్ పేరుతో ఈ సమావేశం జరగనుంది. మాజీ ఉపప్రధాని సర్దార్‌వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా ఈసమావేశం ఏర్పాటు చేశారు. అహ్మదాబాద్‌లోని ఈ మున్సిపాలిటీకి 1924 నుంచి 1928 వరకు పటేల్ అధ్యక్షుడిగా పనిచేశారు. అందుకే ఈ సమావేశానికి అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సమావేశానికి మేయర్ శిరీష వివిధ అంశాలపై ప్రసంగించనున్నారు.

సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 5 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.93 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 78,569

తలనీలాలు సమర్పించినవారు: 27,482


ఈ పరీక్షలు ఇక ఈజీ



- ప్రభుత్వమే సమకూర్చనున్న జవాబు పత్రాలు
- అసెస్‌మెంట్ బుక్‌లెట్లతో విద్యార్థులకు తప్పిన భారం
- ప్రగతి, సామర్థ్యం తెలుసుకునేందుకు అవకాశం

తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక పాఠశాల పరీక్షల నిర్వహణలోనూ వినూత్న విధానానికి శ్రీకారం చుట్టింది. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను, పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేలా అసెస్‌మెంట్ బుక్‌లెట్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. 1నుంచి 10తరగతుల విద్యార్థులు ఎఫ్ఏ, ఎస్ఏ పరీక్షలను ఇక బుక్‌లెట్లలోనే రాయల్సి ఉంటుంది. ఇప్పటివరకూ ఫార్మేటివ్ అసెస్‌మెంట్, సమ్మిటివ్ అసెస్‌మెంట్ విధానాల్లో పరీక్షలు నిర్వహించేవారు. విద్యార్థులు సొంత ఖర్చుతోనే జవాబు పత్రాలు తెచ్చుకోవాల్సి వచ్చేది. దిద్దిన తర్వాత ఉపాధ్యాయులకు జవాబు పత్రాలను తీసి చూసే పరిస్థితి ఉండేది కాదు. ఈ లోపాలకు చెక్ పెడుతూ ప్రభుత్వం కొత్త పద్ధతిని అమలు చేస్తోంది.





అసెస్‌మెంట్ బుక్‌లెట్ కవర్‌పేజీ - ఓఎంఆర్ షీట్



విద్యార్థులకు ఉపయుక్తం : అసెస్‌మెంట్ బుక్‌లెట్ విధానం విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుంది. విద్యార్థుల ప్రగతి సామర్థ్యాలను ఎప్పటికప్పుడు తెలుసుకుని అభ్యసనా సామర్థ్యాలను మదింపు చేయడానికి ఉపయోగపడుతుంది. ఓఎంఆర్ షీట్లను అనుసంధానం చేయడంవల్ల విద్యార్థుల సామర్థ్యాన్ని సమగ్రంగా విశ్లేషించేందుకు అవకాశముంటుంది. విద్యార్థులకు ప్రభుత్వమే జవాబు పత్రాలను సమకూర్చడంతో విద్యార్థులకు ఇబ్బంది తప్పింది.

- బి. మురళీకృష్ణ నాయకుడు, ఎస్టీయూ జిల్లా సహాధ్యక్షుడు

పరీక్షల్లో వినూత్న విధానం

విద్యాసంవత్సరంలో 4 ఫార్మేటివ్ అసెస్‌మెంట్లు, 2 సమ్మేటివ్ అసెస్‌మెంట్లు ఉంటాయి. ఈ పరీక్షలు రాయడానికి ప్రభుత్వమే 72 పేజీల బుక్‌లెట్ల రూపంలో విద్యార్థులకు జవాబు పత్రాలను సమకూర్చుతోంది. బుక్‌లెట్ విధానం వల్ల మూల్యాంకనం తరువాత జవాబు పత్రాలు మూలన పడేసే పరిస్థితి ఉండదు. ఒక ఎఫ్ఏకి, మరో ఎఫ్ఏకి మధ్య విద్యార్థుల ప్రతిభా సామర్థ్యాల్లో ఎలాంటి మార్పులొచ్చాయో ఉపాధ్యాయులు పరిశీలించే అవకాశం ఉంటుంది. ఏదేని జవాబుకు సున్నా మార్కులు వేసినా, మార్కులు తగ్గించినా కారణాన్ని టీచర్ రాయాల్సి ఉంటుంది. దీంతో విద్యార్థులు పొరపాటును దిద్దుకునే వెసులుబాటు ఉంటుంది. ఇప్పటికే ఒకసారి ఈ పద్ధతి కింద పరీక్షలు రాశారు.

బుక్‌లెట్లు వేర్వేరుగా ఇవ్వాలి



ఫార్మేటివ్, సమ్మేటివ్ అసెస్‌మెంట్లకు ఒకే అసెస్‌మెంట్ బుక్ ఇచ్చారు. ఇలాకాకుండా వేరువేరు బుక్‌లెట్లుగా ఇవ్వాలి. కాన్పరెన్సులు, యాప్‌ల పనిభారంవల్ల మూల్యాంకనం చేసేందుకు సమయం ఉండటంలేదు. ఇప్పటి వరకూ జవాబు పత్రాలను ఇంటికి తీసుకెళ్లి మూల్యాంకనం చేస్తున్నాం. ఇప్పుడు పెద్ద పరిమాణంలో ఉన్న అసెస్‌మెంట్ బుక్స్‌ను తీసుకెళ్లడం ఇబ్బందిగా ఉంది. వేరువేరుగా బుక్‌లెట్లను ఇస్తే కొంత వెసులుబాటుగా ఉంటుంది. వచ్చే ఏడాదినుంచి అలాగే చేస్తామని మంత్రి లోకేష్ మాట ఇచ్చారు.

- శవన్నగారి బాలాజీ, ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు

ఆ రోజు మీ వాణి ఏమైంది?

- టీటీడీ ప్రతిష్టను దెబ్బతీసేలా కల్పిత విమర్శలొద్దు
- నిజా నిజాలపై చర్చకు సిద్ధమా?
- భూమనపై ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడి ఆగ్రహం

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): 'విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో వెండి సింహాలు మాయం. అంతర్వేదిలో రథాలు దహనం. పిఠాపురంలో దేవాలయాల మీద దాడులు.. దేవతా విగ్రహాలు ధ్వంసం. శ్రీవారికి సీఎం హోదాలో జగన్ సతీసమేతంగా ఏనాడైనా పట్టువస్త్రాలు సమర్పించారా.. డిక్లరేషన్‌పై సంతకం చేశారా.. హిందువుల మనోభావాలు దెబ్బతినేలా నాడు జరిగిన సంఘటనలపై భూమన కరుణాకరెడ్డి వాణి ఏమైంది' అంటూ ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసనంద సరస్వతి నిలదీశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ, నాస్తికుడైన భూమన హిందూ సమాజానికి ప్రతినిధిగా ప్రచారం చేసుకుంటూ తిరుమలలో ఏదో జరిగిపోతోందని టీటీడీ ప్రతిష్టను దెబ్బతీసేలా కల్పిత విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. శిల్పి చెక్కి భిన్నమైపోయిన విగ్రహం ఏ దేవతామూర్తిదో తెలియకుండా విష్ణుమూర్తి అంటూ విమర్శలు చేయడం చూస్తుంటే కనీస అవగాహన లేకుండా టీటీడీ ఛైర్మన్‌గా ఏలా పనిచేశావో అంతుపట్టడం లేదన్నారు. టీటీడీ ఛైర్మన్‌గా భక్తుల గురించి పట్టించుకోకుండా అవినీతి, అక్రమాలు తదితర వ్యవహారాలతో తిరుమల కొండను అపవిత్రం చేసినప్పుడు కరుణాకర్‌రెడ్డిలోని సనాతనవాది ఏమయ్యారని ప్రశ్నించారు. తిరుమల కొండపై చేసిన అపవిత్రాలతోనే వైసీపీ 11 సీట్లతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. టీటీడీలో ప్రస్తుతం జరుగుతున్న మంచి కార్యక్రమాలను చూసి ఓర్వలేక పనిగట్టుకుని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. టీటీడీలో నాడు, నేటి పరిస్థితులు, ఆయన చేసిన నిరాధార ఆరోపణలపై చర్చకు రావాలని భూమనకు పిలుపునిచ్చారు. ఇలాంటి ఆరోపణలు మానుకోకపోతే గుణపాఠం చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సాధు పరిషత్ సభ్యులు శివానంద స్వామి, గణేష్ స్వామి, ఓంకార్, నీలకంఠ, అరుణ్, మునిబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసనంద సరస్వతి

ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు

- రూ.6 లక్షల జరిమానా

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం స్మగ్లర్ గడ్డం రవికి ఐదేళ్ల పాటు జైలు శిక్ష విధిస్తూ రాష్ట్ర ఎర్రచందనం కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి నరసింహమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. అన్నమయ్య జిల్లా కలకడ మండలం ముడియంవారిపల్లికి చెందిన గడ్డం రవి, కడప జిల్లా రాసపల్లికి చెందిన రాగి మహేష్, శివయ్య, నగేష్, టి.సుండుపల్లికి చెందిన మల్లికార్జున 2018లో శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం మొక్కలు నరికి అక్రమంగా తరలిస్తుండగా ఫారెస్ట్ అధికారులకు పట్టుబడ్డారు.వారి నుంచి9 దుంగలు స్వాధీనం చేసుకున్నారు. తాజాగా ఈ కేసును రాష్ట్ర స్థాయి ఎర్రచందనం కోర్టు విచారించింది. నిందితుల్లో గడ్డం రవికి ఐదేళ్ళ జైలు శిక్ష, రూ.6 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. మిగిలిన నలుగురిపై సాక్ష్యాధారాలు నిరూపణ కాకపోవడంతో నిర్దోషులుగా ప్రకటించినట్లు లైజన్ అధికారి శ్రీనివాసులు చెప్పారు.

శ్రీసిటీని సందర్శించిన బెల్జియం కాన్సుల్ జనరల్



బెల్జియం కాన్సుల్ జనరల్‌కు స్వాగతం పలుకుతున్న శ్రీసిటీ ఎండీ

సత్యవేడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బెల్జియం కాన్సుల్ జనరల్ ఫ్రాంక్ గీర్కెన్స్ అధికారుల బృందంతో బుధవారం శ్రీసిటీలో పర్యటించారు. శ్రీసిటీ ఛైర్మన్ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి వారికి సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి ప్రత్యేకతలను వివరించారు. కాన్సుల్ జనరల్‌తో చర్చల సందర్భంగా పారిశ్రామిక అభివృద్ధి గురించి వివరించిన రవీంద్ర సన్నారెడ్డి 31 దేశాలకు చెందిన 240కి పైగా పరిశ్రమలు ఇక్కడ స్థాపించాయని తెలిపారు. విభిన్న రంగాలలో పెట్టుబడి అవకాశాల కోసం అన్వేషిస్తున్న కంపెనీలకు శ్రీసిటీ అత్యంత విలువైన గమ్యస్థానం అన్నారు. పర్యటనలో భాగంగా కాన్సుల్ జనరల్ శ్రీసిటీ పరిసరాలను సందర్శించారు. శ్రీసిటీ వసతుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. విదేశీ పెట్టుబడిదారులకు ఇది అత్యంత అనువైన ప్రదేశం అని వ్యాఖ్యానించారు. వెర్మీరన్ సంస్థ అధునాతన వీల్ చైర్లు తయారు చేయడం ద్వారా బెల్జియం పరిశ్రమలకు శ్రీసిటీలో పునాది వేసిందని ప్రశంశించారు. ప్రపంచ స్థాయి పునరావాస పరికరాల తయారీ సంస్థ వెర్మీరన్ పరిశ్రమ శ్రీసిటీలో ఏర్పాటు కావడం ఆనందంగా ఉందన్న రవీంద్ర సన్నారెడ్డి గ్లోబల్ భాగస్వామ్యాలను ప్రోత్సహించాలనే శ్రీసిటీ నిబద్ధతను ప్రతిబింబిస్తోందని తెలిపారు. అనంతరం వెర్మీరన్ పరిశ్రమను ఫ్రాంక్ గీర్కెన్స్ సందర్శించి, అక్కడ ఉత్పత్తులు, ఇతర పారిశ్రామిక కార్యకలాపాలను పరిశీలించారు. ఆయనతో పాటు బెల్జియంలోని ఫ్లాండర్స్ రీజియన్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కమిషనర్ జయంత్ నడిగర్ వెర్మీరన్ ఎండీ సయ్యద్ రియాజ్ ఖాద్రీ పాల్గొన్నారు.

విజిలెన్స్ జమేదార్ దురుసుతనం

తిరుచానూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఓ భక్తురాలిపై ఆలయ మహిళా జమేదార్ చేయి చేసుకున్నారు. వివరాలిలా.. మంగళవారం చెన్నై నుంచి ఆండాల్ అనేహిఙ్రా పద్మావతి అమ్మవారి దర్శనానికి వచ్చింది. సన్నిధి వద్ద ఈమెపై మహిళా జమేదార్ దురుసుగా ప్రవర్తించింది. ఈ క్రమంలో వాగ్వాదం పెరగడంతో జమేదార్ భక్తురాలి ముఖంపై చేయి చేసుకుంది. దీంతో ఆమె అక్కడి అధికారులకు ఫిర్యాదుచేసింది. వారు సర్దిచెప్పారు. హుండీ వద్ద కూడా బాధితురాలిపై సదరు జమేదారు మరోసారి దురుసుగా ప్రవర్తించింది. ఆలయం వెలుపల బాధితురాలు విలపించడంతో భక్తులు ఆందోళనకు గురయ్యారు. గతంలో కూడా ఈ జమేదారు ఇదే తరహాలో వ్యవహరించడంతో ఆలయం నుంచి బదిలీ చేశారు. కొన్ని రోజులకే ఓ విజిలెన్సు అధికారి సహకారంతో ఈమె తిరుచానూరులో విధులు నిర్వహిస్తోంది.

తిరుపతిలో కల్తీ మద్యమని ప్రచారం

- అవన్నీ తప్పుడు వార్తలుగా నిర్ధారించిన అధికారులు
- ఇద్దరు వైసీపీ కార్యకర్తల అరెస్టు



ఇద్దరు నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో కల్తీ మద్యం ఉందని, ప్రజలకు భద్రత ఎక్కడ ఉందంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి ప్రచారం చేసిన ఇద్దరు వైసీపీ కార్యకర్తలను ఈస్ట్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి తెలిపిన ప్రకారం.. తిరుపతి వైసీపీ సోషల్ మీడియా సభ్యుడు బ్రుంగి నవీన్, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమ్మణ్యం వ్యక్తిగత సహాయకుడు చంద్రశేఖర్ వెంకటేష్ కలిసి ఈ నెల 7న 'అట్‌దిరేట్ ఆఫ్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ- తిరుపతి' అనే ఇన్‌స్టాగ్రామ్ అకౌంటు ద్వారా 'తిరుపతిలో మద్యం కలకలం.. ప్రజల భద్రత ఎక్కడ' శీర్షికతో వీడియో పోస్టు చేశారు. 11న తిరుపతిలో ఎన్ బ్రాండ్ మద్యం తాగి అపస్మారక స్థితిలో వ్యక్తి అంటూ ఆ పార్టీ ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టారు. ఈ నెల 13న కపిలతీర్థం సర్కిల్ ప్రాంతానికి సంబంధించిన వీడియోలో తిరుపతిలో మద్యం తాగి పడి పోయిన వ్యక్తి అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశారు. వీటిపై విచారణ చేసిన తిరుపతి అర్బన్ ఎక్సైజ్ సీఐ రామచంద్ర.. అవి తప్పుడు పోస్టులని, ప్రజలను తప్పుదారి పట్టించేవని ఈస్ట్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు డీఎస్పీ భక్తవత్సలం పర్యవేక్షణలో ఈస్ట్ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐలు హేమాద్రి, నాగార్జున రెడ్డి విచారించారు. సోషల్ మీడియా ద్వారా నిరంతరం తప్పుడు పోస్టులు పెడుతున్నట్లు సీసీ ఫుటేజీలు, వీడియో షేరింగ్ టైమ్, వాట్సాప్ కాల్ రికార్డులు పరిశీలించి కేసు నమోదు చేశారు. ఆ ఇద్దరిని అరెస్టు చేసి న్యాయమూర్తి ముందు ప్రవేశపెట్టగా, రిమాండు తిరస్కరించారు. 41 నోటీసు ఇచ్చి పంపించారు.

మెడికల్ కాలేజీలపై జగన్ విష ప్రచారం

- 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్



తిరుపతి(కల్చరల్), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జగన్ నిర్లక్ష్యం చేసిన వైద్యరంగాన్ని పీపీపీ పద్ధతి ద్వారా అభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వం సంకల్పిస్తే జగన్ అండ్ కో ఓర్వలేక విషపూరిత ప్రచారాలు చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ విమర్శించారు. ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ నర్సీపట్నం పర్యటనలో జగన్ తీరుచూస్తే మానసిక స్థితి కోల్పోయినట్లు కనిపిస్తోందన్నారు. రాష్ట్రంలో మెడికల్ కళాశాలలకు కేంద్ర ప్రభుత్వ వాటా తప్ప నాడు జగన్ ప్రభుత్వం రాష్ట్ర వాటాను ఎక్కడా వెచ్చించలేదన్నారు. వివిధ దశల్లో నిర్మాణాలను నిలిపేసి ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆ మెడికల్ కాలేజీలకు పూర్వవైభవం తీసుకురావాలనే ప్రయత్నాలకు అడ్డుతగులుతూ రాద్ధాంతం చేస్తున్నారని ధ్వజమెత్తారు. మెడికల్ కాలేజీల విషయంలో కూటమి ప్రభుత్వం గత నిబంధనల మేరకే నడుచుకుంటోందన్నారు. ప్రైవేటు పరం చేస్తున్నారనే మాట వాస్తవం కాదన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాసులు, నాయకులు నరేష్, బీడీ బాలాజీ, ప్రశాంతి, నవీన్, నరేంద్రరెడ్డి, ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ రైటర్ల హంగామా

- రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అటెండర్‌పై దౌర్జన్యం



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అటెండర్‌పై డాక్యుమెంట్ రైటర్ల దౌర్జన్యం

రేణిగుంట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్లు హంగామా సృష్టించారు. కార్యాలయ అటెండర్ తిరుమలేశుపై దౌర్జన్యం చేశారు. లంచం విషయమై సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అటెండర్‌కు, డాక్యుమెంట్ రైటర్ల నడుమ తలెత్తిన వివాదం మంగళవారం మధ్యాహ్నం గందరగోళ పరిస్థితికి దారితీసింది. డాక్యుమెంట్ రైటర్ల జిల్లా అధ్యక్షుడు బుజ్జి ఆధ్వర్యంలో తిరుపతి రూరల్, చంద్రగిరి, రేణిగుంటకు చెందిన డాక్యుమెంట్ రైటర్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వద్దకు చేరుకుని అటెండర్ తిరుమలేశుపై చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఆనందరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సమయంలో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అటెండర్‌పై డాక్యుమెంటు రైటర్లు, వారితోపాటు వచ్చిన ప్రైవేటు వ్యక్తులు దౌర్జన్యానికి దిగారు. దీంతో కార్యాలయంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఇరువర్గాల నడుమ వాగ్వాదం తారస్థాయికి చేరి ఏం జరుగుతుందో తెలియని గందరగోళ పరిస్థితి చోటుచేసుకుంది. కొంత సేపటికి స్పందించిన ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ అందరూ బయటకు వెళ్లిపోవాలని చెబుతూనే అటెండర్‌ను నెట్టివేయడం విమర్శలకు దారితీసింది. ఇదిలా ఉండగా క్రయవిక్రయాలకు వచ్చే పార్టీల వద్ద దస్తావేజుల, రిజిస్ట్రేషన్ ఇతర విషయాలు సబ్ రిజిస్ట్రార్‌తో మాట్లాడుతామని తమను కార్యాలయంలోకి రావద్దని, పార్టీలతో లోపల మాట్లాడవద్దని చెప్పడానికి అటెండర్‌కు హక్కు లేదని డాక్యుమెంట్ రైటర్లు చెబుతున్నారు. ఇప్పటికే రెండు రోజులుగా సాగుతున్న ఈ వివాదంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విధులు స్తంభిస్తున్నాయి. అటెండర్‌పై చర్యలు తీసుకోకపోతే తాము డాక్యుమెంట్లు రూపొందించకుండా షాపులు మూసివేస్తామని రైటర్లు హెచ్చరించారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఇక్కడి పరిస్థితులను చక్కబెట్టడానికి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

రేపటి నుంచీ ఎస్వీయూలో యువ తరంగ్-2025

యువ తరంగ్-2025 లోగో

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీలో ఈ నెల 16 నుంచీ యువ తరంగ్-2025 నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని యూనివర్సిటీ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ విభాగం చేపట్టింది. సంగీత, నృత్య సంబంధమైన సుమారు 30 అంశాల్లో పోటీలు ఉంటాయి. యూనివర్సిటీ అనుబంధ కాలేజీల నుంచీ 40 కళా బృందాలు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి. 16వ తేదీ ఉదయం 10 గంటలకు శ్రీనివాసా ఆడిటోరియంలో యువ తరంగ్-2025 ప్రారంభం కానుంది. శాప్ ఛైర్మెన్ రవినాయుడు, వీసీ నరసింగరావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు ప్రారంభిస్తారు. ఈ మేరకు స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ మురళీధర్, కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్ తెలిపారు.

కౌశల్ సైన్స్‌క్విజ్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఈవో కేవీఎన్ కుమార్, భానుప్రసాద్ తదితరులు


తిరుపతి(విద్య), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కౌశల్ సైన్స్ క్విజ్ పోటీలకు విద్యార్థులను సిద్ధం చేయాలని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ పిలపునిచ్చారు. కౌశల్ జిల్లా కోఆర్డినేటర్‌తో ధనుంజయ్‌తో కలిసి మంగళశారం ఆయన తన ఛాంబర్‌లో సైన్స్ క్విజ్ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... భారతీయ విజ్ఞానమండలి, ఆంధ్రప్రదేశ్ సైన్స్ సిటీ, ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంయుక్త నిర్వహణలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న సైన్స్ ప్రతిభాన్వేషణ పోటీలు ఈ ఏడాది తిరుపతిలో జరుగుతాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు bvmap.org లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 7032889880 సెల్‌ఫోన్ నంబర్‌లో జిల్లా కౌశల్ కోఆర్డినేటర్ డి. ధనంజయులును లేదా 8919387388 సెల్ నంబర్‌లో అడిషనల్ కోఆర్డినేటర్ టి. తులసిని సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో కౌశల్ జిల్లా అడిషనల్ కోఆర్డినేటర్ టి. తులసి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బదిలీ అయిన అధికారులకు వీడ్కోలు



శుభం బన్సల్‌కు శ్రీవారి జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా జేసీగా పనిచేసి బదిలీపై వెళుతున్న శుభం బన్సల్ సేవలు ఎనలేనివని కలెక్టర్ వెంకటేశ్వర్ కొనియాడారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్‌లో పరిశ్రమల డైరెక్టర్‌గా బదిలీపై వెళుతున్న జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాలకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. కలెక్టర్ మాట్లాడుతూ అధికారులిద్దరూ ప్రజలకు ఉత్తమ సేవలు అందించారన్నారు. శుభం బన్సల్ మాట్లాడుతూ శ్రీవారు కొలువై ఉన్న తిరుపతిలో పనిచేసినందుకు సంతోషంగా ఉందన్నారు. డీఆర్వో నరసింహులు మాట్లాడుతూ ఏపీఐఐసీ భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్, మ్యూటేషన్, 22ఏ పెండింగ్ విషయాల్లో జాయింట్ కలెక్టర్ సేవలు మరువలేనివన్నారు. శుభం బన్సల్, రాఘవేంద్రమీనాలను జిల్లా అధికారులు ఘనంగా సన్మానం చేసి జ్ఞాపికలు అందజేశారు. నగర పాలకసంస్థ కమిషనర్ మౌర్య, ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాష్‌రెడ్డి, కిరణ్మయి, జిల్లా అధికారులు పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ బదిలీపై వెళుతుండటంతో బాధ్యతలను కలెక్టర్ పర్యవేక్షించనున్నారు.



సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనాను సత్కరిస్తున్న కలెక్టర్

ఇన్‌సర్వీస్ బీఈడీ అభ్యర్థుల ఎంపిక జాబితా విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ దూరవిద్య ఇన్ సర్వీసు బీఈడీ కోర్సులో సీటు పొందిన అభ్యర్థుల జాబితా విడుదలైంది. బీఈడీ, స్పెషల్ బీఈడీ, బీఈడీ అడిషనల్ మెథడాలజీ కోర్సుల్లో ప్రవేశానికి 2, 500 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 500 మందికి సీట్లు కేటాయించారు. మార్కులు, ఎక్స్‌పీరియన్స్, రోస్టర్‌ను అనుసరించి ఎంపిక చేశారు. సీటు పొందిన వారు రూ. 24, 500 ఫీజును ఆన్‌లైన్ ద్వారా బుధవారం చెల్లించాలని దూరవిద్యా డైరెక్టర్ ప్రొఫెసర్ అరుణ తెలిపారు.